మనం

జనం కోసం అక్షర యజ్ఞం...

AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHBUBNAGAR | WARANGAL | KHAMMAM

అమరావతి | సంపుటి: 3 • సంచిక: 26 • పేజీలు: 8+8 • వెల: రూ.5 | గురువారం • 3-1-2019 | www.manamnews.com | /manamnews

పక్కా ప్లాన్‌తోనే!

విశాఖ విమానాశ్రయంలో జగన్‌పై దాడి



- అక్టోబరు 18నే దాడికి ప్రణాళిక
- దాడి రోజున కోడికత్తికి పదును
- మీరంతా నన్ను టీవీలో చూస్తారు..
- నా అపాయింట్‌మెంట్ తీసుకోవాలి
- ఇద్దరు మహిళలతో శ్రీనివాస్ కోతలు
- కావాలనే జగన్ ఫొటోతో కలిపి ఫ్లెక్సీ
- కుట్రపూరితంగానే కోడికత్తితో దాడి
- విశాఖపట్నం సీపీ ఎంసీ లడ్హా వెల్లడి

విశాఖపట్నం, జనవరి 2:

వైఎస్‌ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై నిందితుడు శ్రీనివాస్ పక్కా ప్రణాళిక ప్రకారమే దాడి చేశాడు. ఈ విషయాన్ని విశాఖపట్నం నగర పోలీసు కమిషనర్ మహేశ్ చంద్ర లడ్హా వెల్లడించారు. నిజానికి గతే డాది అక్టోబరు 18వ తేదీనే జగన్ మీద దాడి చేయాలని శ్రీనివాస్ ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడని.. అయితే ఆయన 17వ తేదీన హైదరాబాద్ వెళ్లిపోవడంతో అది సాధ్యం కాలేదని ..మిగతా 2లో



నా కష్టం.. మీ కోసం

దేశంలో వ్యవసాయాభివృద్ధి 2.4 శాతమే

- మన రాష్ట్రంలో ఈ రంగాభివృద్ధి 11%
- పొరుగురాష్ట్రం తెలంగాణలో 0.4 శాతం
- కేసీఆర్ నా దగ్గర మంత్రిగా పనిచేశారు..
- ఆయనను అనాలంటే సభ్యత అడ్డొస్తుంది
- రాష్ట్రాభివృద్ధికి పవన్ కల్యాణ్ సహకరించాలి
- ఇప్పటికే పోలవరం పనులు 63 శాతం పూర్తి
- కేంద్రం సహకరించకపోయినా పని చేస్తున్నాం
- పది రంగాలపై పది శ్వేతపత్రాలు ఇచ్చాం..
- వాటితో భవిష్యత్తుకు విజన్ డాక్యుమెంట్లు
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచన
- కుప్పంలో 6వ విడత జన్మభూమి- మాఊరు

తిరుపతి, జనవరి 2 (మనం న్యూస్ బ్యూరో):

రాష్ట్ర ప్రజల కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసమే తాను ఇంతలా కష్టపడుతున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. తన కష్టానికి ఓట్ల ద్వారా కూలి ఇవ్వాలని ప్రజలను కోరారు. బుధవారం ఆయన తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో ఆరో 'జన్మభూమి -మా ఊరు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనికిముందు చీలాపల్లి పంచాయతీ వడ్డీపల్లిలో ఎన్టీఆర్ గృహాలు, మంచినీటి కుళాయిలు, ఇంకుడు గుంతలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పోలవరం రాష్ట్రానికి జీవనాడి అని, ఇప్పటికే 63 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. అయితే పోలవ రాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన తర్వాత కేంద్రం రూ. 3600 కోట్లు అందజేయాల్సి ఉందని తెలిపారు. అయినా కేంద్రం పూర్తిగా సహకరించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికే వర్షపునీటిని భూగర్భజలాలుగా మారుస్తున్నామని, నదుల అనుసంధానం చేపడుతున్నామని తెలిపారు. పోలవరం నుంచి పట్టిసీమ ద్వారా కుప్పం వరకు నీరు తెస్తామని తెలిపారు. రైతులకు బిందుసేద్యం చేయడానికి 90 శాతం సబ్సిడీ ఇస్తున్నామన్నారు. వ్యవసాయ అభివృద్ధి దేశంలోనే 2.4 శాతం ఉందని, మన రాష్ట్రంలో 11%కు పెరిగిందని తెలిపారు. తెలంగాణలో 0.4% మాత్రమే వ్యవసాయ అభివృద్ధి ఉందని తెలిపారు. రై తులు అప్పుల ఊబిలో కూరుకుపోయి, ఆత్మహత్యలకు పాల్పడకుండా అధికారుల ద్వారా సూచనలు ఇప్పిస్తున్నామని తెలిపారు. జనసేన నాయకుడు పవన్ కల్యాణ్‌కు కేంద్రం చేసిన అన్యాయం తెలుసునని, ఆయన రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని కోరారు. జన్మనిచ్చిన భూమి రుణం తీర్చుకోవాలని అన్నారు. ప్రజలకు న్యాయం చేయాల్సిన బాధ్యత ఆయనకు కూడా ఉందని తెలిపారు. మరో మూడు నాలుగు నెలల్లో ఎన్నికలు రానున్నాయని గుర్తు చేశారు. వంటగదికే పరిమితమైన మహిళలను ..మిగతా 2లో

ఇదీలోకం!



నేనేంటో.. ఎన్టీఆర్‌కు బాగా తెలుసు.. ఇప్పుడు కొత్తగా చెప్పక్కర్లేదు!

ఈ ఫార్మాకు ఊరట

ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలకు ఓకే

- నిషేధంపై తాత్కాలిక స్టే మంజూరు.. ప్రిస్క్రిప్షన్‌తోనే ఆన్‌లైన్ అమ్మకాలు
- కేంద్ర ప్రభుత్వం కూడా గుర్తిస్తోంది.. డ్రగ్స్ చట్టాన్ని సవరించే ప్రయత్నాలు
- వ్యాపారన్ని అక్రమం అనడం తగదు.. మద్రాస్ హైకోర్టులో ఈ ఫార్మా వాదన
- సింగిల్ జడ్జి తీర్పుపై స్టే ఇచ్చిన కోర్టు



చెన్నై, జనవరి 2:

ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలపై మద్రాస్ హైకోర్టు డివిజన్ బెంచ్ ఊరటనిచ్చింది. ఇంతకు ముందు వీటిని నిషేధిస్తూ సింగిల్ జడ్జి బెంచ్ ఇచ్చిన తీర్పుపై స్టే విధించింది. కేంద్రప్రభుత్వం నియంత్రణ నిబంధనలను నోటిఫై చేసేవరకు ..మిగతా 2లో



హైకోర్టు విభజన పిటిషన్ కొట్టివేత

ఇప్పటికే న్యాయమూర్తుల ప్రమాణస్వీకారం

- ఇక మేం జోక్యం చేసుకోలేం
- సుప్రీం ధర్మాసనం స్పష్టీకరణ
- విభజన వాయిదాకు పిటిషన్
- పిటిషన్‌ను కొట్టేసిన ధర్మాసనం

2

తొలిసారి శబరిమల ఆలయంలోకి మహిళలు


తెల్లవారుజామున అయ్యప్ప దర్శనం

- పోలీసుల భద్రత మధ్య ఆలయంలోకి
- వెళ్లిన కనకదుర్గ, బిందు అమిని
- విషయం తెలిసి ఆలయం మూసివేత
- సంప్రోక్షణ తర్వాత తెరచుకున్న దేవాలయం
- వెల్లువెత్తిన నిరసనలు, ఆందోళనలు
- నేడు కేరళ బంద్‌కు భక్తుల పిలుపు



2

వాతావరణం



ఆంధ్రప్రదేశ్‌లో గురువారం వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి చలి పెరుగుతుంది. గంటకు మూడు కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 32 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 17 డిగ్రీలు

గాలిలో తేమ: 56 శాతం

ముహూర్తం

శ్రీచాంద్రమాన విళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి: బహుళపక్షం, త్రయోదశి రా.3.54 వరకు, తదుపరి చతుర్దశి, నక్షత్రం: అనూరాధ ప.12.32 వరకు, తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం: సా.6.23 నుంచి 8.05 వరకు, దుర్ముహూర్తం: ఉ.10.15 నుంచి 10.57 వరకు, తదుపరి ప.2.37 నుంచి 3.22 వరకు, రాహుకాలం: ప.1.30 నుంచి 3.00 వరకు, యమగండం: ఉ.6.00 నుంచి 7.30 వరకు, అమృతఘడియలు: తె.4.25 నుంచి 6.04 వరకు(తెల్లవారితే శుక్రవారం)

పర్రీకర్ ఇంట్లో 'రఫేల్' ఫైల్లు

ఆ విషయం గోవా మంత్రే చెప్పారు

7

- మా దగ్గర సంభాషణ ఆడియో టేపు
- లోక్‌సభలో వినిపించేందుకు రాహుల్ యత్నం
- అనుమతించని స్పీకర్.. రెండుసార్లు మైక్ కట్
- సభలో గందరగోళం.. సభ్యుల అరుపులు కేకలు
- అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం
- ప్రధాని మోదీ, జైట్లీపై రాహుల్ ఘాటు విమర్శలు
- తిప్పికొట్టిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి.. మండిపాటు
- అవి కావాలని సృష్టించిన ఆధారాలు: పర్రీకర్



చాపర్లు చకచకా..!

అమెరికా నుంచి చినూక్.. అపాచీ హెలికాప్టర్లు

2

- మార్చిలోగా భారత దళాలకు చేరిక
- భారీ సామగ్రిని మోయగలిగే చినూక్..
- అపాచీల దాడి సామర్థ్యం.. అపారం
- భారత సైన్యానికి రెండూ ఆవశ్యకమే
- ఇప్పటివరకు పాత చాపర్లే మనకు దిక్కు
- ఈ రెండూ వస్తే వైమానిక దళానికి బలం
- ప్రిడేటర్-బి డ్రోన్లపై భారతదేశం కన్ను
- తదుపరి రక్షణ ఒప్పందాలు దాని కోసమే!





పక్కా ప్లాన్‌తోనే!

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. అక్టోబరు 25వ తేదీన విశాఖ విమానాశ్రయంలో జగన్ మోహన్‌రెడ్డిపై జరిగిన దాడి.. హత్యాయత్నానికి సంబంధించిన వివరాలను ఆయన బుధవారం విశాఖపట్నంలో మీడియాతో వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించిన పలు కీలక వివరాలను ఆయన వెల్లడించారు. నిందితుడు శ్రీనివాస్ వెల్డర్‌గా, కేక్ మాస్టర్‌గా, వంటవాడిగా పలు చోట్ల పనిచేశాడని కమిషనర్ తెలిపారు.

కత్తికి బాగా పదును..

దాడి చేయాలనుకున్న రోజునే నిందితుడు శ్రీనివాస్ తన వద్ద ఉన్న కోడిపందాల కత్తికి బాగా పదును పెట్టించాడని ఈ విషయాన్ని అతడి సహచరులు కూడా చూశారని చెప్పారు. దాడి జరిగిన రోజు పక్కా ప్రణాళికతో ఇంటి నుంచి శ్రీనివాస్ తెల్లవారుజామున 4.55 గంటలకే బయల్దేరాడని చెప్పారు. ఉదయం 8 గంటలకు హేమలత, అమ్మాజీ అనే ఇద్దరు తెలిసున్న మహిళలకు ఫోన్ చేసి 'ఈ రోజు మీరంతా నన్ను టీవీలో చూస్తారు' అని, అమ్మాజీతో 'ఒక సంచలనం చూస్తారు' అని పలుమార్లు శ్రీనివాస్ చెప్పాడని సీపీ పేర్కొన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే మాదిరిగా తన వద్దకు రావాలన్నా కూడా ఇక మీదట తన పీఏ అపాయింట్‌మెంట్ తీసుకొని రావాలని ఆమెతో చెప్పాడని తెలిపారు. ఉదయం 9గంటల సమయంలో రెస్టారెంట్‌లో కూడా మరోసారి కోడికత్తికి పదును పెట్టాడని తెలిపారు. రెండుసార్లు కోడికత్తిని వేడి నీటిలో స్టెరిలైజ్ చేశాడని, హైదరాబాద్ వెళ్లేందుకు విశాఖ విమానాశ్రయానికి వచ్చిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. తమ పార్టీ నాయకుడైన కరణం ధర్మశ్రీతో మాట్లాడుతున్న సమయంలో అదను చూసుకుని శ్రీనివాస్ కత్తితో దాడి చేశాడని లడ్డా చెప్పారు. 2017 జనవరిలో జగన్‌తో ఉన్న ఫ్లెక్సీని తయారు చేయించాడని, అక్టోబర్ 18నే జగన్‌పై దాడి చేసేందుకు శ్రీనివాస్ ప్రణాళిక వేశాడని చెప్పారు. అయితే, అక్టోబర్ 17నే జగన్ హైదరాబాద్ వెళ్లడంతో అది సాధ్యపడలేదని లడ్డా వెల్లడించారు. జాతీయ భద్రతా అంశాలు ఉంటేనే ఈ కేసును ఎన్ఐఏ దర్యాప్తు చేస్తుందని, శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని కొద్ది గంటల్లోనే వివరాలు చెప్పాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. జగన్‌పై విష ప్రయోగం చేయాలనే ఉద్దేశం నిందితుడికి లేదనే విషయం తమ విచారణలో వెల్లడైందని సీపీ తెలిపారు. తన మీద జరిగిన దాడి ఘటనపై జగన్ మోహన్ రెడ్డి ఇప్పటికీ పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదన్నారు. తాము చెప్పేదాకా చార్జిషీట్ దాఖలు చేయవద్దని హైకోర్టు ఆదేశించిందని ఈ సందర్భంగా మీడియాకు పోలీసు కమిషనర్ లడ్డా వివరించారు.

నా కష్టం.. మీ కోసం

(మొదటి పేజీ తరువాయి)

డ్వాక్రాగ్రూప్‌ల ద్వారా వెలుగులోకి తీసుకొచ్చామని చెప్పారు. వారికి పసుపు కుంకుమ ద్వారా పది వేల రూపాయలు ఇచ్చామని, వారి ద్వారా పేదరికం లేని గ్రామాలను తీర్చిదిద్దుతామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇవ్వాల్సిన లోటు బడ్జెట్ ఇవ్వలేదని, వెనుకబడిన జిల్లాలకు ఇచ్చే రూ. 50 కోట్లు ఇచ్చినట్లే ఇచ్చి తిరిగి తీసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కడపలో ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేయడంలో వెనక్కు తగ్గడంతో, మనమే శంకుస్థాపన చేసుకున్నామని తెలిపారు. దుగరాజపట్నం పోర్టు, విశాఖ రైల్వే జోన్, కాకినాడ ఆయిల్ రిఫైనరీ వ్యవహారాల్లోనూ కేంద్రం సహకారం అందించడం లేదని తెలిపారు. రాజధాని నిర్మాణానికి రూ. 1500 కోట్లు ఇచ్చి చేతులు దులిపేసుకున్నారని, రాష్ట్రం నుంచి రూ. 6వేల కోట్ల మేర పన్నులు చెల్లిస్తున్నా, రాజధాని నిర్మాణానికి ఇవ్వాల్సిన నిధులు ఇవ్వడం లేదని మండిపడ్డారు. సీనియర్ నాయకుడిగా దేశంలోని రాజకీయ పార్టీలన్నింటినీ ఒక తాటిపైకి తీసుకుని వచ్చి బీజేపీని ఓడించి దేశాన్ని రక్షించాలనే ఉద్దేశంతో పని చేస్తున్నానని అన్నారు. ట్రిపుల్ తలాక్ వ్యవహారం కూడా బెడిసి కొట్టిందని, అందరికీ ఒకే చట్టం ఉండాలని, ఒక్కో మతానికి ఒక్కో చట్టం తగదని అన్నారు. తాను ఉక్రోషంగా వ్యవహరిస్తున్నట్లు ప్రధాని అన్నారని, అయితే నమ్మించి మోసం చేశారనే బాధ తనకు ఉందని, అందుకే 11 ధర్మపోరాటాలు చేశానని తెలిపారు.

నా దగ్గర పనిచేసిన వ్యక్తి కేసీఆర్

తెలంగాణలో మహాకూటమి ఓడిపోయిందనే విషయంపై ఎద్దేవా చేయడం తగదని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. తన దగ్గర మంత్రిగా పనిచేసిన వ్యక్తి కేసీఆర్ అని, ఆయన మాటలు ఎబ్బెట్టు కలిగించేలా ఉన్నాయని తెలిపారు. తిరిగి అనడానికి తనకెంతో సేపు పట్టదని, అయితే తనకు సభ్యత, సంస్కారం ఉన్నాయని గుర్తు చేశారు. రాష్ట్రంలో 27 లక్షల ఇళ్లు నిర్మాణాలు చేపడుతున్నామని అన్నారు. 2022 నాటికి అందరికి ఇళ్లు ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. భవిష్యత్తులో గర్భిణీలు ప్రైవేటు ఆసుపత్రులలో ప్రసవం చేయించుకున్నా నిధులు అందజేస్తామని అన్నారు. ఇటీవల పది శ్వేత పత్రాలను విడుదల చేశామని, వాటిపై జన్మభూమిలో చర్చించి,



ఆయా జిల్లాల కలెక్టర్లు భవిష్యత్తులపై విజన్ డాక్యుమెంట్లు పంపించాలని కోరారు. భవిష్యత్తులో కరెంటు చార్జీలు పెంచబోమని, వ్యవసాయానికి సోలార్ పంప్‌సెట్లు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. త్వరలోనే ఆధార్ తరహాలో భూములకు భూదార్ కార్డులు ఇస్తామని, ఒక వ్యక్తికి చెందిన భూములను మరో వ్యక్తి రిజిస్టరు చేసుకునే వీలు లేకుండా చేస్తున్నట్లు తెలిపారు. పవన్ కల్యాణ్ కూడా రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని, మరో మూడు నాలుగు నెలల్లో ఎన్నికలు వస్తాయని తెలిపారు. మళ్లీ తానే ముఖ్యమంత్రిగా రావాలని ప్రజలు కోరుతున్నారని, అదే తనకు కొండంత అండ అని అన్నారు. ఈ సమావేశంలో మంత్రి అమరనాథ రెడ్డి, ఎంపీ శివ ప్రసాద్, ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, జిల్లా కలెక్టరు ప్రద్యుమ్న, డీఐజీ కాంతిరాణా టాటా తదితరులు పాల్గొన్నారు.

ఈ ఫార్మాకు ఊరట

(మొదటి పేజీ తరువాయి)



ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలను నిషేధిస్తూ డిసెంబరు 17న మద్రాస్ హైకోర్టు సింగిల్ జడ్జి బెంచి ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ తీర్పుపై ఈ ఫార్మా సంస్థలు దాఖలు చేసిన రిట్ పిటిషన్లన్నింటి నీ కలిపి జస్టిస్ ఎం.సత్యనారాయణన్, జస్టిస్ పి. రాజమాణిక్యంలతో కూడిన ధర్మాసనం స్టే విధించింది. అప్పీళ్లను ఈనెల 24వ తేదీన విచారిస్తామని చెప్పి, అప్పీళ్ల విచారణ మొత్తం పూర్తయ్యే వరకు సింగిల్ జడ్జి తీర్పుపై స్టే విధిస్తున్నట్లు తెలిపారు. స్టే మంజూరు చేసేందుకు కారణాలేంటన్న విషయాన్ని బహిరంగంగా చదవలేదు గానీ, కేసులో తుది తీర్పు వెలువడేవరకు ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలకు మాత్రం అనుమతించారు. తమిళనాడు కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను విచారించిన సింగిల్ జడ్జి ఆన్‌లైన్ అమ్మకాలను నిషేధించారు. ఆన్‌లైన్ పోర్టళ్లు, మొబైల్ యాప్‌ల ద్వారా మందులు అమ్మడం అక్రమమని పిటిషన్‌లో వాదించారు. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ నిబంధనలకు సవరణలు చేయాలని ఇంకా ప్రతిపాదన ల దశలోనే ఉండగా, ఇంకా గెజిట్‌లో నోటిఫై కాకముందే ఇలా అమ్మడం సరికాదని చెప్పారు. దాంతో.. కేంద్ర ప్రభుత్వం ఈ ఫార్మా సంస్థలకు రిజిస్ట్రేషన్ అవకాశం కల్పించి, అవన్నీ నిబంధనలకు అనుగుణంగా ఉండేలా నియంత్రణలు విధించేవరకు.. ఆన్‌లైన్‌లో మందులను అమ్మడాన్ని నిషేధిస్తూ సింగిల్ జడ్జి ఆదేశాలు జారీచేశారు. ప్రస్తుతమున్న నిబంధనలను మార్చేవరకు ఈ నిషేధం అమలువుతుందని చెప్పారు. దీనిపై పలు ఈ ఫార్మా సంస్థలు మద్రాస్ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. వీటి తరపున సీనియర్ న్యాయవాదులు హాజరై, తమ వాదనలు వినిపించారు. దాంతో తుది తీర్పు వెల్లడించేవరకు సింగిల్ జడ్జి తీర్పుపై స్టే విధిస్తున్నట్లు కోర్టు తెలిపింది. తమ వ్యాపారాన్ని అక్రమమని అనకూడదని, కేంద్ర ప్రభుత్వం కూడా ఈ వ్యాపారాన్ని తగిన విధంగా నియంత్రించేందుకు ప్రయత్నిస్తోందని ఈ ఫార్మా సంస్థలు వాదించాయి. నిషేధం విధిస్తే కేవలం ఆన్‌లైన్‌లోనే ఔషధాలను కొనుగోలు చేయడానికి అలవాటుపడిన వాళ్లు ఇబ్బంది పడతారని తెలిపారు. వైద్యులు రాసిచ్చిన ప్రిస్క్రిప్షన్ కాపీని స్కాన్‌చేసి అప్‌లోడ్ చేయనిదే అసలు ఈ ఫార్మా సంస్థలేవీ మందులు అమ్మడం లేదని, వాటిని కూడా క్వాలిఫైడ్ ఫార్మాసిస్టులతో తనిఖీ చేయించి, అప్పుడు ఇంటికి మందులు పంపుతున్నామని చెప్పారు. వీరి వాదనలతో సంతృప్తి చెందడంతో ధర్మాసనం స్టే మంజూరు చేసింది. దాంతో ఈ ఫార్మా సంస్థలు ఊపిరి పీల్చుకున్నాయి.

హైకోర్టు విభజన పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ, జనవరి 2: ఉమ్మడి హైకోర్టు విభజనను తాత్కాలికంగా వాయిదా వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం కొట్టివేసింది. ఇప్పటికే రెండు హైకోర్టుల న్యాయమూర్తులు విడివిడిగా ప్రమాణ స్వీకారాలు కూడా పూర్తి చేసిన నేపథ్యంలో ఇక ఈ అంశంపై తాము జోక్యం చేసుకోలేమంటూ.. పిటిషనర్ల వాదనను సుప్రీంకోర్టు ధర్మాసనం తోసిపుచ్చింది.ఏపీ రాజధాని అమరావతిలో హైకోర్టు భవనాలు, జడ్జిల నివాస సముదాయాల నిర్మాణాలు పూర్తయ్యే వరకు హైకోర్టు విభజనను తాత్కాలికంగా వాయిదా వేయాలని ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. తొలుత ఈ పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టాలన్న అభ్యర్థనను తిరస్కరించిన సుప్రీం కోర్టు... బుధవారం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పిటిషనర్ల వాదనను జస్టిస్ ఏకే సిక్రి, జస్టిస్ అబ్దుల్ నజీర్‌లతో కూడిన ధర్మాసనం తోసిపుచ్చింది. ఇప్పటికే రెండు హైకోర్టులు ఏర్పాటు కావడంతో తాము ఈ అంశంలో జోక్యం చేసుకోలేమని స్పష్టంచేసింది.

యూపీఏది దొంగల ముఠా కూటమి

నిధులు మావి.. కమీషన్లు మీకా? విష్ణువర్ధన్



అనంతపురం, జనవరి 2, మనం బ్యూరో: యూపీఏ అంటే దొంగల ముఠా కూటమి అంటూ రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. బుధవారం అనంతపురం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో పాత్రికేయులతో మాట్లాడిన ఆయన.. ఆంధ్రప్రదేశ్‌లో అవినీతి తప్ప.. అభివృద్ధి లేదన్నారు. సీఎం చంద్రబాబు ప్రధాని నరేంద్రమోడీని చర్చకు రావాలని పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మోదీ, కేసీఆర్, జగన్‌లను ముగ్గురు మోదీలుగా పేర్కొంటున్న చంద్రబాబు.. నాలుగో మోదీగా పవన్‌కళ్యాణ్‌ను ఎందుకు జత కట్టలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, ప్రజలకు, ప్రతిపక్ష నేతలకు చివరకు పోలీసులకు కూడా రక్షణ కరువైందన్నారు. రాయలసీమలో 3 రోజుల పాటు బీజేపీ నేత అమిత్‌షా పర్యటిస్తారని, దమ్మొంటే.. అడ్డు కోవాలని సవాల్ విసిరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పార్థసారధి, జిల్లా అధ్యక్షులు అంకాల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, నాయకులు అంబటి రామకృష్ణారెడ్డి, రామకృష్ణ, సుదర్శన్, మల్లారెడ్డి, శ్రీనివాసులు, పెద్దన్న, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తొలిసారి శబరిమల ఆలయంలోకి మహిళలు

కొచ్చి, జనవరి 2: తొలిసారి శబరిమలలోని అయ్యప్పస్వామిని ఇద్దరు మహిళా భక్తులు దర్శించుకు న్నారు. 10 నుంచి 50 ఏళ్ల మధ్య ఉన్న మహిళలకు శబరిమల ఆలయ ప్రవేశం కల్పిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటి నుంచి మహిళా భక్తులు ఆలయంలో ప్రవేశించడం ఇదే మొదటిసారి. 42 ఏళ్ల కనకదుర్గ, 44 ఏళ్ల బిందు అమిని అనే భక్తులు దర్శనానంతరం ఆనందంగా బయటికి వచ్చి, ఆతరువాత కాసేపటికి వీడియో కూడా విడుదల చేశారు. సుప్రీంకోర్టు 96 రోజుల క్రితం ఇచ్చిన తీర్పును అనుసరిస్తూ తాము అయ్యప్ప దర్శనం చేసుకున్నట్టు దర్శనానంతరం వీరు వెల్లడించారు.

లక్షలాది మహిళా భక్తులకు ప్రాతినిధ్యం.

లక్షలాది మహిళా భక్తులకు తాము ప్రాతినిధ్యం వహించినట్టు బిందు సగర్వంగా మీడియాకు వెల్లడించడం విశేషం. బుధవారం తెల్లవారుజామున ఒకటిన్నరకు తాము శబరిమలలోని పంబ బేస్ క్యాంప్ నుంచి దర్శనానికి వచ్చినట్టు యాత్ర జరిగిన తీరును మీడియాతో పంచుకున్నారు. సన్నిధానంకు వచ్చేసరికి తెల్లవారుజామున మూడున్నర అయిందని, అప్పుడు దర్శనం చేసుకుని వెనుదిరిగినట్టు, ఇందులో తమకు ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాలేదని, ఎవరూ ప్రతిఘటించి తమను అడ్డుకునే ప్రయత్నం చేయలేదని కనకదుర్గ చెప్పుకొచ్చారు. తమను ఎవరూ ప్రశ్నించలేదని, తమకు ఎలాంటి నిరసన ఎదురుకాలేదని వీరు వెల్లడించడం విశేషం.

ధృవీకరించిన సీఎం పినరాయి..

మహిళలుగా తమకున్న న్యాయపరమైన హక్కును వినియోగించుకున్నట్టు మరో భక్తురాలు కనకదుర్గ వెల్లడించారు. కోజిక్కోడ్ జిల్లాలోని కోయిళ్యాండీకి చెందిన బిందు సీపీఐ(ఎంఎల్) కార్యకర్త కాగా, కనకదుర్గ సివిల్ సప్లైస్‌లో ఉద్యోగినిగా మళప్పురంలోని అంగాడిపురంలో పనిచేస్తున్నారు. వీరిద్దరూ తాము దర్శనం చేసుకున్న వీడియోను రిలీజ్ చేసిన కొద్దిసేపటికి కేరళ సీఎం పినరయి విజయన్ ఇద్దరు మహిళా భక్తులు అయ్యప్ప దర్శనం చేసుకున్నట్టు ధృవీకరించారు. పైపెచ్చు.. ''గతంలో ఇక్కడ నిరసనలుండేవి, కానీ ఈరోజు ఇద్దరు మహిళా భక్తులు శబరిమల గుళ్లో ప్రవేశించారు. మహిళా భక్తులు ఎవరు అయ్యప్ప దర్శనానికి వచ్చినా వారికి అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపట్టాలని మేం పోలీసులకు ఆదేశాలు జారీచేశాం'' అంటూ సీఎం పినరయి విజయ్ పేర్కొన్నారు. అయితే తాము ఎలాంటి పోలీస్ రక్షణ లేకుండానే పంబ నుంచి సన్నిధానం చేరుకున్నట్టు మహిళా భక్తులు వెల్లడించడంతో ఇక్కడ ఏమాత్రం పోలీసు పహారా ఉందో అర్థమవుతోందని అయ్యప్ప భక్తులు మండిపడుతున్నారు.



ఆలయం మూసివేత.. సంప్రోక్షణ..

మొత్తం ఘటనపై స్పందించిన పండాళం రాజకుటుంబ సభ్యుడు శశి వర్మ, సన్నిదానంలోకి మహిళా భక్తులు ప్రవేశించడం చారిత్రాత్మకం కాదు, కానీ ఇది శబరిమల సంప్రదాయాలకు విరుద్ధం అని ప్రకటించారు. ''గుడి ఆచారాలను అనుసరించాలి. సంప్ర దాయాలు మార్చేందుకు మేం సిద్ధంగా లేము''అంటూ గుడిని సంప్రోక్షించి, శుభ్రపరచాలన్నారు. వర్మ చేసిన ఈ వ్యాఖ్యల అనంతరం గుడి తలుపులు మూసి, 'శుద్ధి కళశం'(సంప్రోక్షణ సంప్రదాయాలు) నిర్వహించారు. మహిళలు ఆలయంలో ప్రవేశించారన్న వార్త దావాన లంలా వ్యాపించగానే ప్రధాన ఆలయం మూసివేసి, సంప్రోక్షణ చేపట్టారు. దీంతో కొద్దిసేపు ఆలయం మూసివేశారు. 50 ఏళ్లలోపు వయసున్న మహిళా భక్తులు ఇద్దరు సన్నిధానంలో 18 మెట్లు ఎక్కి అయ్యప్ప దర్శనం చేసుకున్నారన్న వార్త సీఎం అధికారికంగా ధృవీకరించాక ప్రధాన అర్చకులైన కందారు రాజీవరు సమక్షంలో ఉదయం పదకొండున్నర ప్రాంతంలో సంప్రదాయ బద్ధంగా శుద్ధి కార్యక్రమం జరిగింది.

పక్కా ప్రణాళికతోనే?

అయితే ప్రధాన తంత్రిని విధుల నుంచి తొలగించాలని ప్రముఖ మళయాళ రచయిత చేస్తున్న డిమాండ్ ఇప్పుడు అత్యధికుల మద్దతు కూడగడుతోంది. మరోవైపు కేవలం రాజకీయ ఉద్దేశాలు ఉన్నవారు మాత్రమే ఇక్కడ మహిళల ప్రవేశాన్ని అడ్డుకుంటున్నట్టు బీజేపీని ప్రస్తావిస్తూ బిందు వెల్లడించడం విషయం చూస్తుంటే ఇదేం చిన్నవిషయం కాదని, పక్కా ప్రణాళిక ప్రకారమే ఇదంతా జరిగినట్టు అర్థమవుతోంది.

పవిత్రత-విధ్వంసం

పవిత్రమైన అయ్యప్ప దేవాలయాన్ని కేరళ ప్రభుత్వం అపవిత్రం చేస్తోందని బీజేపీ ఐటీ సెల్ ఆరోపించింది. ''అన్ని వయసుల మహిళలను ఆలయంలోకి ప్రవేశించేందుకు సదుపాయం కల్పిస్తూ శబరిమల ఆలయం పవిత్రతను కమ్యూనిస్టులు మంటగలుపుతున్నారా? ఇదే నిజమైతే ఇదో విధ్వంసం'' అంటూ ఐటీ సెల్ చేసిన ట్వీట్ పెద్ద దుమారం రేపుతోంది. ఇద్దరు మహిళలు అయ్యప్ప దర్శనం చేసుకోవడంపై బీజేపీ జాతీయ కార్యదర్శి బీఎల్ సంతోష్ మండిపడ్డారు. ''ఇదో చరిత్రాత్మక ఘటనగా మీడియా అభివర్ణిస్తోంది, ఔరంగజేబు, చెంగిజ్ ఖాన్, జై చంద్‌లు కూడా చరిత్రలో భాగమే, కానీ వీరిని ప్రజలు ఏరీతిన గుర్తుంచుకుంటారు? మీడియా సిగ్గుపడాలి'' అన్నారు.

అయినప్పటికీ ముందు జాగ్రత్త చర్యలో భాగంగా దర్శనం చేసుకున్న ఇద్దరు మహిళా భక్తుల ఇంటివద్ద కేరళ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆందోళనకారులు వీరి నివాస స్థలాలను ముట్టడించవచ్చనే అంచనాతోనే పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తున్నారు.

సెప్టంబరు నుంచి ఇదే తంతు..

మరోవైపు సెప్టంబరులో సుప్రీంకోర్టు తీర్పు వెలువడినప్పటి నుంచీ కేరళ రాష్ట్రం అట్టుడుకుతోంది. కాంగ్రెస్, వామపక్ష కూటమి, బీజేపీ, మహిళా-ప్రజాసంఘాలు సుప్రీం తీర్పుపై చెరో పక్షం వహిస్తూ తీర్పును వ్యతిరేకిస్తున్నవారు, తీర్పును స్వాగతిస్తున్న వర్గాలను రెచ్చగొడుతున్నాయి. అయ్యప్ప ఆలయంలో దశాబ్దాలుగా సాగుతున్న ఆచార వ్యవహారాలను గతంలో అటకెక్కించిన ప్రతిఫలంగా తుపాను రూపంలో ప్రకృతి కన్నెర్ర చేసిందని, అయినా మళ్లీ అలాంటి చర్యలే చేపట్టడం తగదని సంప్రదాయవాదులు వాదిస్తున్నారు.

మాకేం భయం లేదు!

ఇంటికి వెళ్లేందుకు తామేం భయపడ్డం లేదని బిందు, కనకదుర్గలు నిర్భయంగా వెల్లడించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఎందుకంటే గతంలో ఇలా ఆలయ ప్రవేశం చేసేందుకు ప్రయత్నించిన మహిళలకు చెందిన కార్యాలయాల్లో, ఇంటివద్ద అయ్యప్ప భక్తులు నానాహంగామా చేసి భయాందోళనలకు గురిచేశారు. ప్రజల మనోభావాలను తాము దెబ్బతీయ లేదన్న వంద శాతం విశ్వాసం తమకుందని వీరు ఘంటాపథంగా పేర్కొనడం సరికొత్త వివాదానికి దారితీస్తోంది. కాగా అత్యధిక మహిళలు తమ అంతరాత్మ ప్రబోధానుసారం నడుచుకునేందుకే మొగ్గుచూపుతున్నారు. 50 ఏళ్లు దాటేవరకూ తాము అయ్యప్ప దర్శనానికి వెళ్లమని, అప్పటి వరకూ భక్తిశ్రద్ధలతో వేచి చూస్తామని ఉద్యమాలు చేస్తుంటే.. వీరికి చెక్ పెడుతూ మరోవైపు అంతే స్థాయిలో లింగ వివక్ష, మహిళా సాధికారత అంటూ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి.

చాపర్లు చకచకా..!

న్యూఢిల్లీ, జనవరి 2: సైనికావసరాలకు ఉపయోగపడేలా భారీ మొత్తంలో సామగ్రిని మోసుకెళ్లగలిగే చినూక్ హెలికాప్టర్లు, దాడులకు ఉపయోగపడే అపాచీ హెలికాప్టర్లు త్వరలో భారత సైన్యానికి రానున్నాయి. అమెరికా నుంచి తొలి బ్యాచ్ హెలికాప్టర్లు మార్చి నెలలో వస్తాయి. దాంతో భారత సైనిక సామర్థ్యం మరో ఎత్తుకు పెరిగింది. అమెరికాకు చెందిన బోయింగ్ కంపెనీ నుంచి కంటెయినర్లలో గుజరాత్‌లోని ముంద్రా ఓడరేవుకు ఇప్పటికే చినూక్ హెలికాప్టర్లు బయల్దేరాయి. ఇవి ఫిబ్రవరి నాటికి చేరుతాయి. 15 చినూక్ హెలికాప్టర్లు, 22 అపాచీ ఎటాక్ హెలికాప్టర్ల కోసం భారత్ 3 బిలియన్ డాలర్లు వెచ్చిస్తోంది. మరో ఆరు అపాచీలు ఇచ్చేందుకు కూడా ట్రంప్ సర్కారు ఇప్పటికే ఆమోదం తెలిపింది. భారత, అమెరికా దౌత్యవేత్తలు చెప్పేదాన్ని బట్టి.. ఏరియల్ ప్లాట్‌ఫారాలను బోయింగ్ సంస్థ రీఅసెంబుల్ చేస్తుంది. భారత ఆర్మీకి చాపర్లు అందించే ముందు ఒకసారి అన్నింటినీ ఫ్లైట్ టెస్ట్ కూడా చేస్తుంది. చినూక్ హెలికాప్టర్లను చండీగఢ్ వైమానిక స్థావరం వద్ద ఉంచుతారు. ఇది సియాచిన్, తూర్పు లఢఖ్ సెక్టార్లకు సరఫరాలు పంపేందుకు చాలా కీలకమైన ప్రాంతం. హెల్‌ఫైర్ మిస్సైళ్లతో కూడిన అపాచీ హెలికాప్టర్లను ఘజియాబాద్‌లోని హిండన్ వైమానిక స్థావరానికి అప్పగిస్తారు. ఈ రెండు రకాల హెలికాప్టర్లు రావడం వల్ల భారత సైనిక దళాలకు గట్టి బలం వచ్చినట్లవుతుంది. ఇప్పటివరకు రష్యన్ తయారీ ఎంఐ-17మీదే మనం ఆధారపడుతున్నాం. ఇవి ఒక మాదిరి సామర్థ్యం మాత్రమే కలిగి ఉన్నాయి. వీటినే బలగాలను వేగంగా తరలించేందుకు వాడుతున్నాం. వాటితోపాటు ఎంఐ-26 చాపర్లు కూడా ఉన్నాయి. భారతదేశం వద్ద కేవలం రెండు స్క్వాడ్రన్ల ఎంఐ-35 చాపర్లము మాత్రమే ఉన్నాయి. వాటిని 1980లలో అఫ్ఘానిస్థాన్ ఆక్రమణ సమయంలో నాటి సోవియట్ యూనియన్ వాడేది. ఇంత పాతవాటితోనే ఇన్నాళ్ల బట్టి నెట్టుకొస్తున్నాం. అమెరికా రక్షణ మంత్రి జిమ్ మాటిస్ భారత్‌కు అనుకూలంగా ఉండేవారు. ఆయన రాజీనామా చేయడంతో మన దేశం ఆందోళనకు గురైంది. కానీ, ఆయన స్థానంలో వస్తున్న పాట్రిక్ ఎం షానహాన కూడా భారతదేశం పట్ల చాలా సానుకూల దృక్పథంతోనే ఉంటారని తెలుస్తోంది. దాంతో.. జల, వాయు, భూమార్గాలలో మన సైనిక సామర్థ్యాన్ని పెంచుకునేందుకు అమెరికా సాయం చాలావరకు అందే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఇక అమెరికా-భారత్ మధ్య అతిపెద్ద రక్షణ ఒప్పందం ప్రిడేటర్-బి సాయుధ డ్రోన్లకు సంబంధించి ఉంటుంది. ఈ విషయమై భారత సైనిక దళాలు అమెరికాతో జరుపుతున్న చర్చలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయి. అయితే, భారత భూభాగం వివరాలను అమెరికాకు ఇవ్వడానికి మనం, వాళ్ల వివరాలు మనకు ఇవ్వడానికి అమెరికా.. రెండూ సుముఖంగా లేవు. ఈ విషయంలో డీఆర్‌డీ వో, భారత వైమానిక దళం అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. దాంతో జియోస్పేషియల్ సహకారం విషయంలో బెకా ఒప్పం దం మీద సంతకాలు జరిగేందుకు మరింత కృషి జరగాల్సి ఉం ది. ఇప్పటికే లాజిస్టిక్స్ ఎక్స్ఛేంజ్ మెమొరాండం ఆఫ్ ఎగ్రి మెంట్, కమ్యూనికేషన్స్ కాపబులిటీ అండ్ సెక్యూరిటీ అగ్రిమెం ట్‌లపై భారత్ సంతకాలు చేసింది. ఇవి అమెరికాతో మనకు రక్షణ ఒప్పందాలు కుదిరేందుకు చాలా కీలకం అవుతాయి.

మోదీని గద్దె దింపుతాం

- **ఎవరు ఏకమైనా టీడీపీదే విజయం..**
- **ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి**

కర్నూలు సిటీబ్యూరో, జనవరి 02, మనం న్యూస్: రాష్ట్రానికి అన్యాయం చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీని గద్దె దింపుతామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో 'చంద్రన్న సంక్రాంతి కానుక'ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ మోదీ, జగన్, కేసీఆర్ ఏకమైనా పేద ప్రజలు తెలుగుదేశం పార్టీని గెలిపిస్తారని ఉపముఖ్యమంత్రి ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన వారిని ఎవరిని వదిలే ప్రసక్తే లేదని హెచ్చరిస్తూ లోటు బడ్జెట్ ఉన్న రాష్ట్ర ప్రభుత్వం 125 సంక్షేమ కార్యక్రమాలను నిరుపేదలకు అందిస్తున్నామన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి పీఠం కోసమే పాదయాత్రలు చేస్తూ హామీలిస్తున్నారు కానీ ఒక్కసారైనా అసెంబ్లీకి వచ్చారా? అని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ చల్లా రామకృష్ణా రెడ్డి, ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, కలెక్టర్ సత్యనారాయణ, జాయింట్ కలెక్టర్ రవి పటాన్‌శెట్టి, కమిటీ సభ్యురాలు గుడిసె కృష్ణమ్మ, డీఎస్ఓ పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.



పెళ్లికెళ్లి.. తిరిగిరాని లోకాలకు

- నలుగురు మృతి, మృతుల్లో చిన్నారి

యడ్లపాడు, మనం ప్రతినిధి, జనవరి 2: వివాహ వేడుకకు హాజరై తిరిగివస్తుండగా జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతిచెందగా మరో ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై బుధవారం మధ్యాహ్నం చిలకలూరిపేట యడ్లపాడు స్పిన్నింగ్ మిల్ ఎదురుగా ఆగివున్న కంటైనర్‌ను కారు ఢీ కొంది. చిత్తూరు జిల్లా మదనపల్లె మండలం ములకల చెరువు గ్రామానికి చెందిన వీరు తూర్పుగోదావరి జిల్లా యర్రవరంలో జరిగిన పెళ్లికి హాజరై తిరిగి వస్తుండగా ప్రమాదం సంభవించడం స్థానికంగా అందరినీ కలచివేస్తోంది. గాయపడ్డ వారిని గుంటూరు కాటూరి మెడికల్ కాలేజీకి తరలించారు. మృతి చెందిన వారిలో డ్రైవరుతో పాటు ఓ బాలుడు, యువతి, మరో మహిళ ఉన్నారు. ప్రమాదంపై యడ్లపాడు పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.



గౌతు కుటుంబానిది మచ్చలేని చరిత్ర

- అనునిత్యం ప్రజా సంక్షేమమే మా ధ్యేయం
- తిత్లీ బాధితులను అన్నివిధాలా ఆదుకున్నాం
- టీడీపీ నేతలు శిరీష, ఎమ్మెల్యే శివాజీ

శ్రీకాకుళం, జనవరి 2 (మనం న్యూస్ బ్యూరో): శ్రీకాకుళం జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సర్దార్ గౌతు లచ్చన్న కుటుంబానిది మచ్చలేని రాజకీయ చరిత్ర అని అనునిత్యం ప్రజాశ్రేయస్సే వారిలక్ష్యమని టీడీపీ జిల్లా శాఖ అధ్యక్షురాలు గౌతు శిరీష, ఎమ్మెల్యే గౌతు శ్యాంసుందరశివాజీ అన్నారు. తమ కుటుంబాన్ని విమర్శించే అర్హత ఏ ఒక్కరికీ లేదన్నారు. శ్రీకాకుళంలోని టీడీపీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. దేశంలో ఏ ఇతర రాష్ట్రాలో కూడా లేని విధంగా పనిచేయని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మన రాష్ట్రంలో ఉన్నారని గౌతు శిరీష అన్నారు. ప్రతిపక్ష నేత పదవిని పోషించడంలో ఆయన పూర్తిగా విఫలమయ్యారన్నారు. మచ్చలేని చరిత్ర తమదని ఎమ్మెల్యే గౌతు శివాజీ పేర్కొన్నారు. తన తండ్రి గౌతు లచ్చన్న చరిత్ర అందరికీ తెలుసునని ఆ విషయాన్ని గుర్తించే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి లచ్చన్న శతజయంతి ఉత్సవాలు నిర్వహించారన్న విషయాన్ని గుర్తు చేశారు. అటువంటి మహనీయుడుకి చెడ్డపేరు రాకుండా నీతినియమాలకు కట్టుబడి రాజకీయాలలో కొనసాగుతున్నానన్నారు.



ప్రాచీన కళలను ప్రోత్సహించాలి

- భారతీయ కళలు సంప్రదాయాలను గౌరవించాలి
- యువత ఆ దిశగా పయణించాలి: గేదెల శ్రీనుబాబు

శ్రీకాకుళం, జనవరి 2 (మనం న్యూస్ బ్యూరో): ప్రాచీన కళలను ప్రోత్సాహించాలని, భారతీయ కళలు, సంప్రదాయాలను గౌరవించాలని డాక్టర్ శ్రీనుబాబు అన్నారు. విశాఖపట్నం గురజాడ కళాక్షేత్రంలో జరిగిన తెలుగు నాటక కళాకారులను డాక్టర్ శ్రీనుబాబు సన్మానించారు. నాటికలకు సంబంధించిన హార్మోనియం లాంటి వివిధ వస్తువులను కళాకారులకు శ్రీను బాబు బహూకరించారు. దాదాపు 500 మంది కళాకారులు వివిధ ప్రదర్శనల తో తిలకించారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడారు. యువత భారతీ య సంప్రదాయాలను గౌరవించే దిశగా పయణించాలన్నారు. ప్రాచీన భారతీ య కలలు, పాటలను, సంస్క తులను ప్రోత్సహించాలి. భారతీయ ప్రాచీన నాటకాలను సంస్క తులను నేటి యువతరానికి అనుగుణంగా సరళీకరించి, శబ్ద సౌందర్యంతో మేళవించి పాటలు, నాటకాలు రూపంలో అందించవలసిన అవసరం ఉత్తరాంధ్ర కళాకారులకు తెలుగు కళాకారులకు అవసరమన్నారు. ఈ విధంగా మనం ప్రాచీన భారతీయ కళలను సంస్కృతులను కాపాడుకో గలం అని డాక్టర్ శ్రీనుబాబు చెప్పారు. ఉత్తరాంధ్ర కలలకు సంస్కృతులకు పాటలకు పద్యాలకు నాటకాలకు పుట్టినిల్లు 19, 20వ శతాబ్దంలో విజయనగ రం శ్రీకాకుళం విశాఖపట్నం కళాకారులకు తెలుగు నాటక రంగంలో మంచి ప్రావీణ్యత ఉండి మంచి పేరు ప్రఖ్యాతులు ఉండేవి అలాంటి సంగీతం ఉత్త రాంధ్ర ఆదరణ లేకపోవడం వలన రోజురోజుకు ఆ సంగీతం అంతరించిపో తుందనీ, ప్రాచీన నాటకాలను అలాగే సంస్కృతులను నాటకాలు పద్యాలు పాటల రూపంలో నేటి యువతరానికి అనుగుణంగా సరళీకరించి తెలుగు నాటకాలను ఉత్తరాంధ్ర కళాకారులను ప్రోత్సహించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

అమెరికాకు పారిపోలేదు

- వ్యక్తిగత పనుల కోసమే వెళ్లా
- రాష్ట్రంపై మరో కోణంలో కుట్ర: శివాజీ

విజయవాడ, జనవరి 2: వ్యక్తిగత పనుల కోసమే తాను అమెరికాకు వెళ్లానని, తాను ఎవరికీ భయపడి పారిపోలేదని సినీ నటుడు శివాజీ పేర్కొన్నారు. తన వెనుక ఏ పార్టీ లేదని, ఒంటరిగానే ఉంటానని అన్నారు. అమెరికా నుంచి తిరిగి వచ్చిన అనంతరం బుధవారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడారు. ఏపీ ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు మరో కొత్త తరహా కుట్ర జరుగుతోందని శివాజీ అన్నారు. రాష్ట్రంలో చుక్కల భూముల రిజిస్ట్రేషన్ కావాలనే ఆపేశారని, మంత్రులు-ఎమ్మెల్యేలు అడుగుతున్నా ఆ అధికారులు వినడం లేదన్నారు. ఇది 3 లక్షల కుటుంబాలకు చెందిన సమస్యని చెప్పారు. 12 లక్షల మందిని ప్రభుత్వానికి దూరం చేసేందుకే ఈ కుట్ర జరుగుతోందని, ఉన్నతస్థాయిలో ఉన్న ముగ్గురు అధికారులు ఈ కుట్రలో భాగస్వామ్యంగా ఉన్నారన్నారు. సీఎం చంద్రబాబుని కలిసి అన్ని వివరాలు చెప్తానన్నారు.

ముగిసిన భవానీ దీక్షల విరమణ

- దర్శనం చేసుకున్న 4 లక్షల భవానీలు
- పూర్ణాహుతితో ముగిసిన తంతు

విజయవాడ, జనవరి 2: విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఐదు రోజుల పాటు జరిగిన భవానీ దీక్షల విరమణ ఉత్సవాల్లో 5 లక్షలమంది భవానీలు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) కోటేశ్వరమ్మ తెలిపారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా దుర్గగుడి యాగశాలలో జరిగిన మహా పూర్ణాహుతి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆలయ వేద పండితులు శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ సంప్రదాయాలు, పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించటం వల్లే ఎలాంటి ఆటంకాలు తలెత్తలేదని ఈవో అభిప్రాయపడ్డారు. భవానీలు ఇంకా వస్తున్నందున దీక్షల విరమణ కోసం చేసిన ఏర్పాట్లు గురువారం కూడా కొనసాగుతాయని తెలిపారు. దుర్గగుడి ఉద్యోగులతో పాటు అన్ని శాఖల సమన్వయంతో ఉత్సవాలు జయప్రదమయ్యాయని చెప్పారు. తెల్లవారుజామున రెండు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకూ భవానీలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శన ఏర్పాట్లను ఆలయ అధికారులు చేసినట్టు వివరించారు. ఉత్సవాల ఫలాన్ని భక్తజనమందరికీ పంచేందుకు పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించినట్లు దుర్గగుడి స్థానాచార్యులు శివ ప్రసాద శర్మ తెలిపారు. పూర్ణాహుతి కార్యక్రమంలో పాలకమండలి ఛైర్మన్ గౌరంగ బాబు తదితరులు పాల్గొన్నారు.



ఏపీకి ఎంతో చేశాం

- చరిత్రలో తొలిసారి పది జాతీయ విద్యాసంస్థలు
- గతంలో ఏ ప్రభుత్వమూ కేటాయించలేదు
- రాష్ట్రానికి ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం
- ఏపీ బీజేపీ కార్యకర్తలతో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, జనవరి 2: ''విభజన చట్టంలో పేర్కొన్న ట్లు ఏపీలో పది జాతీయ స్థాయి విద్యాసంస్థలను ప్రారంభించాం. భారత్ చరిత్రలో ఇప్పటి వరకు ఏ రాష్ట్రానికి... ఇన్ని జాతీయస్థాయి విద్యాసంస్థలు కేటాయించలేదు. టీడీపీ, కాంగ్రెస్ దశాబ్దాలుగా ఏపీని పాలిస్తూ... ఇలాంటి సంస్థలు ఎందుకు ఏర్పాటు చేయలేదు. గతంలో ఏ కేంద్ర ప్రభుత్వం అయినా ఏపీకి ఇంత సాయం చేసిందా? బీజేపీ ఏపీ కోసం ఎంతో చేసింది.. భవిష్యత్‌లోనూ చేస్తుంది. ఏపీకి ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చడానికి సిద్ధం. అయితే ఇచ్చే డబ్బులు దేనికోసం ఇస్తున్నామో దానికే ఖర్చు చేయాలి'' అని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. విశాఖపట్నం, నర్సాపురం, కాకినాడ, విజయన గరం, మచిలీపట్నంలోని బీజేపీ కార్యకర్తలు, పార్టీ నేతల తో ప్రధాని వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. తమ సంక్షేమ పథకాలు భద్రత చుట్టూ తిరుగుతాయని, దేశం లోపలా, బయట భద్రతకు ప్రాధాన్యమిస్తామని చెప్పారు. ప్రధాని సురక్షా బీమా యోజన కింద యాక్సిడెంట్ పాలసీ తెచ్చామని, నెలకు రూపాయితో ప్రధాని జీవన్ జ్యోతి యోజన పథకాన్ని రూపొందించామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏం జరుగుతుందో నాకు తెలుసని ఈ సందర్భంగా ప్రధాని పేర్కొన్నారు. జాతీయ ప్రాధాన్యమున్న 10 విద్యా సంస్థలను ఏపీలో ప్రారంభించామన్నారు. ఏపీ ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. యువత వ్యతిరేక ప్రచారాన్ని నమ్మదని ఆశాభావం వ్యక్తం చేస్తూ మనం చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, విజన్‌ను యువతకు వివరించాలని సూచించారు. యువతతో అన్ని అంశాలపై క్లుప్తంగా చర్చించాలని, వాళ్లు అడిగిన ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పాలన్నారు. ఏపీలో పాలకులు ఏదైనా చేసే ఉంటే ఆ పని గురించి మాట్లాడేవారవని, వాస్తవాలు ఏంటో ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తెలు సునని చెప్పారు. ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేయాలని, అర్హులైన యువత ఓటు నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించా రు. ఏపీలో సాధనాలను ప్రభుత్వం దుర్వినియోగం చేస్తూ.. అసత్యాలను ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. రూ.20 వేల కోట్ల వరకు రిసోర్స్ గ్యాప్, రెవెన్యూ డెఫిసిట్ ఫండ్‌గా విడుదల చేశామన్నారు. ఏపీ ప్రభుత్వం మాత్రం అందలేదని చెబుతోందని, ఆ డబ్బు ఎవరి జేబుల్లోకి వెళ్ళిందని మోదీ ప్రశ్నించారు. వెనుకబడిన జిల్లాలకు రూ. వెయ్యి కోట్లు ఇచ్చామని, ఏపీ ప్రభుత్వం యుటిలైజేషన్ సర్టిఫికెట్లు ఎందుకివ్వలేదన్నారు. పోలవరా న్ని జాతీయ ప్రాజెక్టుగా మా ప్రయత్నంతోనే ప్రకటించారని, పోలవరానికి వందశాతం కేంద్రం డబ్బులు ఇస్తోందని తెలిపారు. ఇప్పటి వరకు పోలవరా నికి రూ.7 వేల కోట్లు ఇచ్చామని, ప్రాజెక్ట్‌ను నిర్వహిస్తామని ఏపీ ప్రభుత్వం అడిగిందని మోదీ పేర్కొన్నారు. ప్రాజెక్ట్‌ను ఏపీ నిర్వహించలేకపోతోందని కాగ్ రిపోర్ట్ చెప్పిందని మోదీ తెలిపారు. ''బీజేపీ ఏపీ కోసం ఎంతో చేసింది.. భవిష్యత్‌లోనూ చేస్తుంది. ఏపీకి ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చడానికి సిద్ధం. అయితే ఇచ్చే డబ్బులు దేనికోసం ఇస్తున్నామో దానికే ఖర్చు చేయాలి'' అని మోదీ అన్నారు. చంద్రబాబు సర్కార్ నిత్యం అబద్ధాలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతోందని దుయ్యబట్టారు. చంద్రబాబు ప్రభుత్వం కుంభకోణాల్లో కూరుకుపోయిందని ఆరోపించారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారని, ఎన్టీఆర్ సిద్ధాంతాలను చంద్రబాబు కాలరాస్తున్నారని మోదీ ధ్వజమెత్తారు.కేంద్ర పథకాలను టీడీపీ తమ ఘనతగా చెప్పుకుంటోందని, టీడీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని కార్యకర్తలకు సూచించారు. తెలంగాణలో టీడీపీ, కాంగ్రెస్‌ల కలయికను ప్రజలు తిరస్కరించిన మాదిరే ఏపీలో కూడా అదే జరుగుతుందని చెప్పారు. బూత్ స్థాయిలో పార్టీ పటిష్టానికి కృషిచేయాలని కోరారు. అవినీతి రహిత భారత్‌కు బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను యువతలోకి తీసుకువెళ్లి చైతన్యపరచాలని కార్యకర్తలకు సూచించారు.



ఆంధ్రప్రదేశ్‌లో పాలకులు కుంభకోణాలకు పాల్పడ్డారు. నాడు ఎన్టీఆర్ కాంగ్రెస్‌ను దుష్ట కాంగ్రెస్‌గా అభివర్ణిస్తే.. ఇప్పుడు అధికారంలో ఉన్న వాళ్లు దోస్త్ కాంగ్రెస్ అంటున్నారు. తెలంగాణ తరహాలో ఏపీలోనూ మహాకూటమిని ప్రజలు తిరస్కరిస్తారు. ఆంధ్రప్రదేశ్ ఆకాంక్షలను చాలా వరకు మా ప్రభుత్వం నెరవేర్చింది. రాష్ట్ర ప్రభుత్వం అవాస్తవాలు ప్రచారం చేస్తోంది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు కార్యకర్తలు తెలియజెప్పాలి. ఆంధ్రప్రదేశ్ మార్పు కోరుతోంది. ప్రస్తుత రాజకీయ నాయకత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. రాష్ట్రాన్ని కాంగ్రెస్ ఏవిధంగా విభజించింది జనం మరిచిపోయారు. ప్రజల మనోభావాలను లెక్క చేయకుండా అన్నదమ్ములను విడదీశారు. విభజనపై మిగతా పార్టీలు రాజకీయం చేస్తుంటే ఏపీకి న్యాయం కోసం మాట్లాడింది బీజేపీయే. బీజేపీ ఏం చేసిందో ప్రజలకు కార్యకర్తలు వివరించారు. జనవరి 6వ తేదీన మరోసారి మీతో మాట్లాడతా'' అంటూ మోదీ తన ప్రసంగం ముగించారు.

గృహనిర్మాణం గడువులోగా పూర్తి

- జన్మభూమిపై రోజువారి నివేదికలివ్వాలి
- సీఎస్ అనీల్‌చంద్ర పునేఠ ఆదేశాలు



అమరావతి, మనం ప్రతినిధి, జనవరి 2: రాష్ట్రంలో ఏపీ టౌన్షిప్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా చేపట్టిన వివిధ పట్టణ గృహనిర్మాణ ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం అమరావతి సచివాలయంలోని ఆయన కార్యాలయంలో ఏపీటీడ్కోకు సంబంధించిన రాష్ట్రస్థాయి శ్యాంక్షనింగ్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. కార్యాచరణ ప్రణాళికపై పూర్తి వివరాలడిగి తెలుసుకున్న సీఎస్.. మొదటిదశ ప్రాజెక్టు పనులను నాలుగైదు నెలల్లో పూర్తి చేసి.. కేంద్రం నుండి రావాల్సిన నిధులను సకాలంలో రాబట్టేందుకు కృషి చేయడంతో పాటు రాష్ట్ర వాటాగా సమకూర్చాల్సిన నిధులను సకాలంలో విడుదల చేయాలని ఆర్థికశాఖ అధికారులను ఆదేశించారు. ఎపీటీడ్కో ఎండీ చేసిన పట్టణ గృహ నిర్మాణ ప్రాజెక్టుల పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో 'ఎన్టీఆర్ నగర్స్' కింద వివిధ పట్టణాల్లో 5,29,786 ఇళ్లు మంజూరు కాగా వాటిలో 4,60,492 గృహాలకు టెండర్లు ఖరారై 3, 60,365 గృహాల నిర్మాణం ప్రారంభం కాగా వాటిలో 1,33,631 ఇళ్లు స్లాబు స్థాయికి చేరాయని వివరించారు. ఎన్టీఆర్ అర్బన్ హౌసింగ్‌కు సంబంధించి 4,28,444 గృహాలు మంజూరు కాగా వాటిలో 1,61,751 ఇళ్లకు పరిపాలనామోదం ఇవ్వగా వాటిలో 1,09,757 ఇళ్లు గ్రౌండ్‌కాగా 71,000 గృహాల నిర్మాణం పూర్తయిందని తెలిపా రు. మొదటి దశ పనులు మార్చిలోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 11 అర్బన్ లోకల్ బాడీస్, 5 అర్బన్ డెవలప్మెంట్ అథారిటీస్ 41 సవివర ప్రాజెక్టు నివేదికల ప్రతి పాదనలు రాగా, వాటి ద్వారా 57,433 గృహాలు నిర్మించాల్సి ఉందన్నారు. ఇందుకు మొత్తం రూ. 3183 కోట్లు వ్యయం కానుండగా కేంద్రం నుండి రూ.861 కోట్లు, రాష్ట్రం నుంచి రూ.676 కోట్లు సమకూరనుండగా మరో రూ.453 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాల నిమిత్తం ఖర్చు చేయనుండగా మిగతా రూ.1191 కోట్లను లబ్దిదారుల వాటాగా భరించాల్సి ఉంటుందని ఎండీ మైదీన్ వివరించారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంత రాములు, మున్సిపల్, పట్టణాభివ ద్ధిశాఖ ముఖ్య కార్యద ర్శి కరికల వలవన్, మున్సిపల్ శాఖ కమీషన్ కె.కన్నబాబు, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే, ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి డా.కెవి.సత్యనారాయణ, ఎపిటిడ్కో ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు. సీఎస్ నిర్వహించిన సమీక్షా సమావేశంలో జన్మభూమిపై జిల్లాల వారీగా రోజువారీ నివేదికలను సకాలంలో నిర్దేశిత ఫార్మాట్స్‌లో పంపాలని ఆదేశించారు. జన్మభూమిపై ఎప్పటికప్పుడు తాజా సమాచారం అందించాలని ప్రణాళికాశాఖ కార్యదర్శి సంజయ్ గుప్తను ఆదేశించారు. దీనిపై ప్రజా స్పందన నివేదికను ఎప్పటి కప్పుడు విడుదల చేయాలని సీఎస్ ఆదేశించారు.

970 ప్రాంతాల్లో త్వరలో ఉచిత వైఫై

రాష్ట్రంలోని 110 మునిసిపాలిటీల్లో 970 ప్రాంతాల్లో ఉచిత వైఫై ఇచ్చే కార్యక్రమం ప్రారంభం కానుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠా వెల్లడించారు. ఫిబ్రవరి 15 నాటికి 1000 కేంద్రాలు ప్రారంభించాలని ఏపీ ఫైబర్ నెట్ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. మొత్తం రూ.53 కోట్ల ఖర్చయ్యే ఈ ప్రాజెక్టులో బహుళజాతి సంస్థ గూగుల్ ఈ సేవలను ఉచితంగా అందించనుంది. ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయంలో 70 శాతం గూగుల్ సంస్థ ప్రభుత్వానికి చెల్లించనుందని అధికారులు వివరించారు. ప్రజా ప్రయోజనాలు కలిగిన ఈ ప్రాజెక్టు ద్వారా ఏప్రిల్ నాటికి 4000 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. అనంతరం గ్రామీణ ప్రాంతాలకు కూడా దీన్ని విస్తరించనున్నట్టు ఏపీ ఫైబర్ నెట్ అధికారులు వివరించారు. అన్ని శాఖల అధికారులు, వారి కార్యాలయాల్లో వైఫై బాక్సులు పెట్టుకునేందుకు సహకరించాలని సీఎస్, పలు శాఖల కార్యదర్శులను ఆదేశించారు. ఈమేరకు ఏపీటీఎల్ (ఏపీ డిజిటల్ ఇన్ఫ్రా), ఏపీ ఫైబర్‌నెట్ కార్యకలాపాలపై పునేఠా బుధవారం వెలగపూడి సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాబోయే మూడు సంవత్సరాల్లో 5జీ సేవల కోసం 12,000 టవర్ల అవసరం ఉంటుందని, ప్రభుత్వం ఎలాంటి పెట్టుబడి పెట్టకుండా, కేవలం స్థలాలను ప్రయివేట్ కంపెనీకి అద్దెకు ఇవ్వడం ద్వారా స్థానిక సంస్థలతో పాటు, పలు శాఖలకు ఆదాయం సమకూరుతుందని ఆయన వివరించారు. ప్రభుత్వ స్థలాలు, భవనాలపై ఏర్పాటు చేసే టవర్లకు ఎంత అద్దె వసూలు చేయాలనే దానిపై, పొరుగు రాష్ట్రాల్లో పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సీఎస్ సూచించారు.

జగన్ వెంటే జనం

- అడుగడుగునా నీరాజనం
- తుది ఘట్టానికి పాదయాత్ర
- ఘన స్వాగతం పలికిన జనం
- కిడ్నీ వ్యాధిగ్రస్తులతో భేటీ
- ఆదుకుంటామని భరోసా
- సమస్యలపై వినతులు వెల్లువ



శ్రీకాకుళం, జనవరి 2 (మనం న్యూస్ బ్యూరో): వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పపాదయాత్ర బుధవారం నాటికి ఇచ్ఛాపురం నియోజకవర్గంకు చేరుకుంది. ఈసందర్భంగా బుధవారం ఉదయం నారాయణపురం శిబిరం వద్ద ప్రారంభమైన యాత్రకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన అభిమానులు, పార్టీ కార్యకర్తలు సంఘీభావం ప్రకటించారు. తుఫాన్ సహాయం అందేలనది ఉప్పాడ జనార్ధన్ దంపతులు, తిత్లీ తుఫాన్‌లో తామెంతో నష్టపోయామని, అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందలేదని తెలిపారు. ప్రభుత్వం కేవలం టీడీపీకి చెందిన వారికి మాత్రమే తుఫాన్ సహాయం అందజేస్తుందని ఆ దంపతులు ఆరోపించారు. మందస మండలంలో మినీరిజర్వాయర్ నిర్మిస్తే ఆ ప్రాంత రైతులు, ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని రైతు సంఘం నేత బెస్త కామేశ్వరరావు కోరారు. పాదయాత్రలో జననేతను కలిసిన ఆయన మీ మేరకు విజ్ఞప్తి చేశారు. పాదయాత్రతో హరిపురం చేరుకున్న జననేతకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో మహిళలు కూడా తరలివచ్చారు. గ్రామంలో ప్రతిష్టించిన మాజీ ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులు విగ్రహాన్ని పాదయాత్ర సందర్భంగా జగన్ ఆవిష్కరించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నాడు ప్రవేశపెట్టి పక్కాగా అమలు చేసిన ఫీజురీయింబర్స్‌మెంట్ పథకం వల్లనే తాము బాగా చదువుకోగలిగామని హరిపురంలో రాజన్నబిడ్డను కలిసిన బి.భారతి పేర్కొన్నారు. ఈ పథకం వల్ల తమ కుటుంబంలో ముగ్గురు ఉన్నత చదువులు చదివి, ఇలాళ మంచి స్థాయిలో ఉన్నారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా భారతి జగన్‌కు సంఘీభాం ప్రకటించారు. వాస్తవానికి నాడు మహానేత వైఎస్ఆర్ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయకపోయి ఉంటే తాము ఎట్టి పరిస్థితుల్లోనూ ఉన్నత చదువులు చదివేవారం కాదని భారతి స్పష్టంచేశారు. తర్వాత అంబుగాం మీదుగా మీదుగా సోంపేట మండలం రాణిగాం చేరుకున్న జగన్ ఇచ్ఛాపురం నియోజకవర్గంలో అడుగుపెట్టారు. దీంతో సుదీర్ఘప్రజాసంకల్పయాత్ర తుది ఘట్టానికి చేరుకుంది. రాణిగాం వద్ద జగన్‌కు ఆ పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. కాగా కిడ్నీ వ్యాధులతోబాద పడుతోన్న లోహరబంద పంచాయతీ పరిధిలోని ఏడు కుగ్రామాల ప్రజలు పాదయాత్రలో జననేతను కలిశారు. నేలపైనే కూర్చుని వారితో మాట్లాడిన జగన్, వారి బాధలన్నీ సావధానంగా విన్నారు. తాము కిడ్నీ వ్యాధులతో బాద పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఎలాంటి సహాయ సహకారాలు అందించడం లేదని తమలో ఎవరికీ పింఛన్లు కూడా మంజూరు చేయలేదని ఆయా గ్రామాల ప్రజలు జగన్ వద్ద వాపోయారు. చివరకు చికిత్సకు అవసరమైన డయాలసిస్ కేంద్రాలు కూడా లేవని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులను ఆదుకుంటానని జగన్ భరోసా ఇచ్చారు. అధికారం చేపడితే ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ రీసెర్చ్ ఏర్పాటు చేస్తామని, అవసరమైన డయాలసిస్ కేంద్రాలు కూడా నెలకొల్పుతామని వెల్లడించారు. వరుస తుఫానులతో ఎంతో నష్టపోయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందడం లేదని మరోవైపు పలాస నియోజకవర్గానికి చెందిన ప్రజలు ఆక్షేపించారు. పాదయాత్రలో జగన్‌ను కలిసి వారు తమ బాధలు చెప్పుకున్నారు. ఇంకా సంక్షేమ పథకాలు ఏమీ తమకు దక్కడం లేదని, అన్ని చోట్లా అధికార పార్టీ నేతలు వివక్ష చూపుతున్నారని , తమ వర్గానికి చెందిన వారికే అన్ని సమకూరుస్తున్నారని పలాస నియోజకవర్గ ప్రజలు జననేత వద్ద వాపోయారు.. మరోవైపు బ్రాహ్మణులు కూడా జగన్ కలిశారు. వారి సమస్యలపై అధ్యయన కమిటీ ఏర్పాటు చేయడంపై వారు హర్షం ప్రకటించారు.

అదనంగా మరో 3 లక్షల పింఛన్లు

- 30 లక్షల మంది పేదలకు గృహాలు: అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం, జనవరి 2 (మనం న్యూస్ బ్యూరో): పేదలకు ప్రభుత్వం మరో 3 లక్షల ఫించన్లు మంజూరు చేసిందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. బుధవారం శ్రీకాకుళం జిల్లాలోని స్థానిక బలగమెట్టలో 6వ విడల జన్మభూమి కార్యక్రమంనకు ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. నాలుగున్నర సంవత్సర కాలంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో చర్చించుకోవడానికి మంచి అవకాశమని తెలిపారు. చర్చించుకొని ఇంకా ఏమి అవసరమో తెలపాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల మంది పేదలకు ఇళ్లను మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.ధనంజయ రెడ్డి పాల్గొన్నారు.



మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

గురువారం, జనవరి 3


నవజాత శిశువుల మరణాలు

గతేడాది దక్షిణాసియాలో నెలరోజుల లోపు నవజాత శిశువుల మృతులు అధికంగా ఉన్నాయంటూ వచ్చిన సమాచారం ఆందోళన కలిగించేదిగా ఉన్నది. దక్షిణాసియాలోని నవజాత శిశువుల ఆరోగ్య పరిస్థితులపై తగిన శ్రద్ధ చూపవలసిన అవసరాన్ని, అత్యవసర పరిస్థితిని ఇది ప్రతిబింబిస్తోంది. తమ పిల్లల ఆరోగ్య స్థితులపై ఎంతోమంది తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్న నేపథ్యంలో పిల్లల ఆరోగ్య సంరక్షణ ఒక్క వైద్యులపై మాత్రమే ఉంచుతుండటం పొరపాటే. 2018లో దాదాపు మిలియన్ మంది నవజాత శిశువులు వివిధ అనారోగ్య కారణాల వల్ల మరణించారు. వారంతా జన్మించి నెలరోజుల లోపు వారే కావడం ఆందోళన కలిగించే విషయం. నవజాత శిశువుల మరణాలు ఇంత పెద్ద సంఖ్యలో ఉండడం ఎవరికైనా ఆవేదన కలిగిస్తుందనడంలో సందేహం లేదు. ప్రపంచవ్యాప్తంగా జన్మించిన నవజాత శిశువుల్లో దక్షిణాసియాలో మరణం దరి చేరిన పిల్లలు 40 శాతం ఆక్రమించడం నిజంగా ఆలోచించాల్సిన సంగతే.


దక్షిణాసియాలో ఆసుపత్రుల కొరత, వైద్యసదుపాయాలు సక్రమంగా లేకపోవడం వంటివి నవజాత శిశువుల మరణానికి కొన్ని కారణాలుగా నిలుస్తున్నాయి. ఇది కాకుండా అసలు ఆందోళన చెందాల్సిన విషయం మరొకటి ఉన్నది. గర్భిణీ అయిన తరువాత మహిళలకు సరైన పోషకపదార్థాలు, ఇతర జాగ్రత్తలు పాటించకపోవడం అసలు సమస్యగా పరిణమించింది. ఇలా ఏడాదికి లక్షలాదిమంది నవజాత శిశువులు మరణిస్తున్న అంశాన్ని పరిశీలిస్తే ఆ పిల్లలకు అందుతున్న వైద్యసాయం, ఇతర పోషకపదార్థాల గురించి పట్టించుకోవలసిన అవసరాన్ని నొక్కి చెబుతోంది. పసిపిల్లల ఆరోగ్య పరిస్థితుల గురించి మనం తీసుకుంటున్న జాగ్రత్తల్లోని లోపాల గురించి, వారికి అందిస్తున్న సౌకర్యాల్లో లోపాల గురించి, వారి పట్ల మనం అనుసరిస్తున్న నాణ్యతా వ్యవహారాలను ఇక్కడ గమనించాల్సి ఉన్నది.

తల్లిదండ్రులు పసిపిల్లల పట్ల అనుసరించాల్సిన నాణ్యతాపరమైన అంశాలను పరిశీలించడం తప్పనిసరి. పసిపిల్లల ఆరోగ్య పరిస్థితుల పట్ల తల్లిదండ్రులకు, సమాజంలోని అధికులకు అవగాహనా లోపం ఎంతో ఉన్నది. నవజాత శిశువు తమ ఇంట ప్రవేశించిందనగానే తాము తీసుకోవలసిన జాగ్రత్తలు, పిల్లల సంరక్షణకు తాము అనుసరించాల్సిన విధానాలు, పిల్లల పట్ల తాము అనుసరించాల్సిన జాగ్రత్తలను క్షుణ్ణంగా తెలుసుకోవడం ఎంతో అవసరం. ఆసుపత్రులు కూడా తాము నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు, అనుసరిస్తున్న విధానాలను ఎప్పటికప్పుడు బేరీజు వేసుకుని సందర్భాన్ని, సమయాన్ని అనుసరించి జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి. అందుకు తల్లిదండ్రులు గమనించాల్సిన విషయాలు కూడా కొన్ని ఉన్నాయి. తమ పిల్లలకు వైద్య సదుపాయం అందించే ఆసుపత్రుల నాణ్యత ఎంత? ఆ ప్రదేశం పరిశుభ్రంగా ఉన్నదా? తమ పిల్లలకు అందిస్తున్న వైద్య సదుపాయం ఏ మేరకు నాణ్యతా ప్రమాణాలతో కూడి ఉన్నది అన్న అంశాన్ని తెలుసుకోవడం తల్లిదండ్రుల బాధ్యత. వైద్యులు పిల్లలకు వైద్యం అందిస్తున్న సమయంలో తమ చేతుల్ని పరిశుభ్రంగా నీటితో కడుక్కున్నారో లేదో అనే చిన్నచిన్న అంశాలను కూడా గమనించాలి. ఇలాంటి చిన్నచిన్న అంశాలు పరిశీలిస్తే... తల్లి ఎంత ఆరోగ్యవంతురాలైనప్పటికీ తమ పిల్లలకు అందుతున్న వైద్యం ఏ మేరకు నాణ్యతా పరమైనదో వెల్లడవుతుంది. ఆసుపత్రి పరిసరాలను గమనిస్తే ఆ వైద్యశాలలో తమ పిల్లల ఆరోగ్య పరిరక్షణకు అవకాశం ఉంటుందో లేదో ఇలాంటి విషయాలే వివరిస్తాయి.

అక్కడి పరిస్థితులు మనకు సంతృప్తికరంగా లేకపోతే ఆ విషయాన్ని ఆసుపత్రి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం, తద్వారా తమ పిల్లలే కాకుండి ఇతర పిల్లల పట్ల కూడా తమ బాధ్యత నెరవేర్చినట్లవుతుంది. ఆ విధంగా పరిసరాలను మనకు అనుకూలంగా మార్చుకునే అవకాశాన్ని పరిశీలించడం ద్వారా మొత్తం నవజాత శిశువుల భవిష్యత్తుకు గట్టి పునాది వేసి, వారిని మరింత ఆరోగ్యవంతులుగా తయారుచేసేందుకు అవకాశం కలుగుతుంది. అలాగే, శరీర ప్రమాణాల రీత్యా ఏ యువతి కూడా 20 ఏళ్ల వరకు గర్భవతి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులు చెబుతున్న అంశాన్ని గమనంలోకి తీసుకోవాలి. ఆమె మొట్టమొదటిసారి గర్భవతి అయిన తరువాత 12 వారాలకు అంటే మూడో నెలనుంచి క్రమం తప్పకుండా వైద్యసాయం అందించాలని అందరూ గ్రహించాల్సిన విషయం. ఆమెకు అప్పటి నుంచి అవసరమైన వైద్యసాయం, తగిన సూచనలు, సలహాలు అందించేలా వైద్యుల పర్యవేక్షణ అవసరం. ఆ విధంగా పాటిస్తే చేయి కాలిన తరువాత ఆకులు పట్టుకున చందంగా పరిస్థితి విషమించకముందే తగు జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుందని వేరుగా చెప్పనక్కరలేదు. పుట్టినప్పటి నుంచి తల్లి పాలే శ్రేష్ఠమని తల్లికి తెలియజేయాలి. అందువల్ల నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణ మొత్తం కేవలం వైద్యులు, నర్సులు, ఆసుపత్రిలోని ఇతర సిబ్బంది చేతుల్లోనే ఉందని భావించడం పొరాపటని గ్రహించాలి. కనీసం 2019లోనైనా నవజాత శిశువులకు తగిన వైద్యసదుపాయం, అవసరమైన చర్యలు తీసుకునేందుకు వీలుగా తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకురావడం ఎంత ప్రాధాన్యం సంతరించుకుంటుందో అర్థం చేసుకుని నడుచుకోవలసిన బాధ్యత కుటుంబ సభ్యులు మరీ ముఖ్యంగా తల్లిదండ్రులపై ఉందని తెలుసుకోవాలి. పుట్టిన ప్రతి ప్రాణికీ జీవించే హక్కు ఉంటుంది. మరి మనలోని అజ్ఞానం, అవగాహనా లోపం వల్ల ఆ హక్కును హరించడం ఏ మేరకు తగినదో ప్రతి ఒక్కరూ ఆలోచించుకోవాల్సిన అవసరం ఉన్నది.



మంచిమాట



సహనం ఎప్పుడూ చేదుగానే ఉంటుంది. కానీ దాని ఫలితాలెప్పుడూ తియ్యగానే ఉంటాయి.

- స్వామి వివేకానంద



జాతీయ పార్టీల చేతుల్లోనే జాతి భద్రత


దేశంలో సార్వత్రిక ఎన్నికలు దగ్గరకు వస్తున్నాయి. ఆరునెలల్లో ఎన్నికలు అయిపోయి కొత్త ప్రభుత్వం కొలువుదీరబోతోంది. అయితే అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుంటే ముఖ్యమంత్రి పదవులను కోరేవారు, పార్లమెంటు ఎన్నికలు వస్తుంటే ప్రధానమంత్రి పదవులను కోరుకునే వారు చాలామందే ఉంటారు. పార్టీల గెలుపులపై ఊహాగానాలు, సర్వేలు, ప్రధానమంత్రి అభ్యర్థులపై ఎవరికోణంలో వారు ఆలోచిస్తుంటారు. తామే ఆ పదవిని ఎక్కబోతున్నట్టు కొందరు లేదా తాము సూచించినవారే ప్రధానిమంత్రి అవుతారని కొందరు ప్రకటనలిస్తుంటారు. తమకు ఒక్కసీటే ఉన్నా ఐదు పది పార్లమెంటు సీట్లున్నా, ఒక్క రాష్ట్రంలోనే పాలనాధికారమున్నా ప్రభుత్వ ఏర్పాటులో చక్రం తిప్పుతామని చెప్పుకునే నాయకులు కొందరుంటే, హంగ్ వస్తే తామే ప్రధాని అవుతామని ప్రగల్భాలు పలికేవారు కొందరుంటారు. రాజకీయాల్లో విలువలనే మాటే మటుమాయమై, రాజనీతి మృగ్యమై మనీ, మాఫియా, మద్యం రాజుకీయాలనేలుతుంటే నోటికొచ్చింది మాట్లాడడం ప్రజల్ని భ్రమల్లో ముంచడం నిత్యకృత్యమైంది. 542 పార్లమెంటు సీట్లున్న దేశంలో ఒకే రాష్ట్రానికే పరిమితమైన ప్రాంతీయ పార్టీలు, పది పదిహేను పార్లమెంటు సీట్లతో కేంద్రంలో చక్రం తిప్పుతాననడం అత్యాశ మాత్రమే కాదు అనైతికం కూడా. కొందరయితే తమకున్న రెండు పదులు కూడా దాటని సీట్లతో, అవి కూడా వస్తాయో రావో తెలియకున్నా ప్రధానమంత్రి సీటు నాక్రమిస్తాననో, ప్రధానమంత్రిని నిర్ణయించడంలో ప్రధాన పాత్ర వహిస్తాననో అనడం ప్రగల్భాలు పలకడం మాత్రమే కాదు. అత్యాశతో కూడిన అనైతిక చర్య.

వివిధ సంస్కృతులు, వివిధ భాషలు, విభిన్న దృక్పథాలు, కులాలు, మతాలు జాతులున్న భారత దేశాన్ని ఏలే అర్హత సువిశాల జాతీయ, అంతర్జాతీయ భావజాలమున్న, దేశవ్యాప్తంగా వ్యాపించి ఉన్న జాతీయ పార్టీలకే ఉంటుంది తప్ప ప్రాంతీయ పార్టీలకుండదు. ఉండకూడదు. దేశంలో ప్రాంతీయ పార్టీలు తామర తంపరగా పుట్టుకొచ్చిన తర్వాత రాష్ట్రాల మధ్య, భాషల మధ్య, ప్రాంతాల మధ్య, నదీ జలాల పంపకం లాంటి అనేక విషయాల్లో తగాదాలు ఎక్కువయ్యాయి. సంకుచిత భావాలు పెరిగాయి. విశాల దృక్పథం కొరవడింది. ప్రాంతీయ పార్టీల ఆలోచనా విధానం తమ రాష్ట్రానికే పరిమితమై, సంకుచితంగా ఉంటే, జాతీయ, అంతర్జాతీయ పార్టీలకు తమతమ రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్త ప్రయోజనాలు, ఇతర రాష్ట్రాలతో సంబంధాలు సత్సంబంధాలుగా ఉండే విధంగా ఉంటాయి. స్నేహ పూరితంగానూ ఉంటాయి. అందువల్ల ప్రాంతీయ పార్టీల నేతలకు తమకున్న అతిస్వల్ప పార్లమెంట్ సభ్యుల బలంతో దేశాన్నేలే అర్హత లేదు. ఏదైనా జాతీయ పార్టీతో కలిసి మంత్రి పదవుల నడుక్కోవాల్సిందే. ఇదే డెబ్బై ఏళ్ళుగా మన దేశంలో జరుగుతోంది. అది న్యాయం కూడా. కనీసంగా వందకు పైగా పార్లమెంట్ సభ్యుల బలం లేకుండా ప్రధాన మంత్రి కావాలనుకునే పార్టీ, పార్టీ నాయకుడు దురాశపడ్డట్టే. అలా ఆశపడడం అనైతికం. అధర్మం కూడా. అలా అయినవారు ఒకరిద్దరు కొన్నిరోజులు మాత్రమే పాలించారని, పార్లమెంట్ ముఖం కూడా చూడకుండా వెనుదిరిగారన్నది వాస్తవం.

ఏదేమైనా జాతీయ పార్టీలో ఉన్నవారు మాత్రమే ప్రధానమంత్రి స్థాయి కెదిగారన్నది, కేంద్రంలో ఉన్నత స్థాయి నాయకులుగా రాణించారన్నది వాస్తవం. జవహర్‌లాల్ నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరా గాంధి, రాజీవ్‌గాంధి ఇలాంటి వాళ్ళంతా కాంగ్రెస్ పార్టీని నడిపించి ఆ పార్టీ ద్వారానే ప్రధానమంత్రుల య్యారు. దక్షిణాది నుంచి మొదటి ప్రధానిగా దేశాన్ని నడిపించిన పి.వి.నరసింహారావు, ఆర్థికవేత్త మన్‌మోహన్‌సింగ్ కాంగ్రెస్ పార్టీలో ఉండడం వల్లనే ప్రధాన మంత్రులయ్యారు. మురార్జీదేశాయ్, వి.పి.సింగ్ లాంటి వాళ్ళు జాతీయపార్టీగా ఏర్పడిన జనతాపార్టీ వల్లనే ప్రధానమంత్రులు కాగలిగారు. వాజ్‌పేయ్ భారతీయ జనతా పార్టీ జాతీయ పార్టీగా దేశవ్యాప్తమై వందకు పైగా సీట్లను సాధించడం వల్లనే ప్రధాన మంత్రులయ్యారు. నరేంద్రమోదీ కూడా బి.జె.పి.కి మూడు వందలకు పైగా సీట్లు పొంది ప్రధాన మంత్రయ్యారు. గుల్జార్‌లాల్ నందా, దేవెగౌడ, చంద్రశేఖర్‌లాంటి వాళ్ళు స్వల్పకాలం ప్రధానమంత్రులైనా జాతీయ పార్టీల నుంచే ప్రధానమంత్రి పదవికి సరిపోయే అన్ని అర్హతలున్నా కరుణానిధి జాతీయస్థాయి లక్షణాలున్న పార్టీయే అయినా డి.ఎం.కె.ను దక్షిణాదిలో విస్తరింపచేయకుండా తమిళనాడుకే పరిమితం చేయడం వల్ల ప్రధాని కాలేకపోయారు. చిదంబరం కాంగ్రెస్‌లో ఉండడం వల్ల రాష్ట్రంలో తనకు బలం లేకున్నా కేంద్రంలో అత్యున్నత మంత్రి పదవుల ననుభవించాడు. తమిళనాడుకెంతో మేలు చేశాడు. ప్రణబ్ ముఖర్జీ లాంటి నేతలు కాంగ్రెస్‌లో ఉండడం వల్లనే కేంద్ర రాజకీయాలను శాసించడమే కాక దేశ అత్యున్నత రాష్ట్రపతి పదవినలంకరించాడు. అంతర్జాతీయ పార్టీ నాయకుడుగా ఉన్న జ్యోతిబసు సి.పి.ఎం నాయకుడిగా ప్రధానమంత్రిగా వచ్చిన అవకాశాన్ని వదులుకున్నాడు. జాతీయస్థాయి పార్టీ కాబట్టే బియస్‌పి నేత మాయావతి ప్రధానమంత్రి పదవిని తన జీవిత లక్ష్యంగా ఎంచుకుంది. బియస్‌పి దేశవ్యాప్తమైనప్పటికీ విస్తరించాల్సినంతగా విస్తరించక తగిన మాన్‌డేట్ సాధించనందువల్ల ప్రధానమంత్రి కాలేకపోతున్నారు. భవిష్యత్తులో ఆమె స్వబలంతో ప్రధానమంత్రి అయ్యే అవకాశముంది. జె.డి.ఆర్, జె.డి.ఎస్పీ లాంటి ప్రాంతీయ పార్టీలు బహుజన సామాజిక నేపథ్యమున్న తమ తమ రాష్ట్రాలకే పరిమితమయ్యాయి. ఇక మిగతా ప్రాంతీయ పార్టీలకైతే ఆయా నేతలు ప్రధానమంత్రులయ్యే అవకాశాలు అసలే లేవు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలతో కావాలని చూడడం తప్పు మాత్రమే కాదు. అత్యంత తాత్కాలికం కూడా.

> దేశవ్యాప్తంగా బి.జె.పి వైఫల్యాలను ఎండగట్టి రాహుల్ ఉప ఎన్నికల్లోనూ, అసెంబ్లీ ఎన్నికల్లోనూ అద్భుత విజయాలను నమోదు చేశాడు. కాంగ్రెస్‌తో లౌకిక, ప్రజాస్వామ్య, సామాజిక , బహుజన, ద్రవిడ, తృణమూల్ లాంటి ప్రాంతీయ, ప్రగతిశీల కమ్యూనిస్టు శక్తుల ఐక్యత మతతత్వ బి.జె.పి అలయెన్సును ఖచ్చితంగా ఓడిస్తుంది.

అందువల్ల జాతీయ, అంతర్జాతీయ భావజాల పార్టీలకే ఈ దేశాన్నేలే అర్హతలున్నాయి. అదే జరుగుతుంది కూడా. మన దేశ భౌగోళిక, చారిత్రక, సామాజిక, సాంస్కృతిక, విభిన్న నాగరికతల స్వభావాన్ని బట్టి ఈ దేశాన్ని ఐక్యంగా ఉంచడానికి జాతీయ స్థాయి, అంతర్జాతీయ స్థాయి గల పార్టీలే దేశాన్నేలాలి. ఆ స్వభావమున్న పార్టీలు ప్రస్తుతానికి భారత దేశంలో నాలుగున్నాయి. ఒకటి లౌకిక, ప్రజాస్వామిక రాజకీయ విలువలపై నడుస్తున్న దేశానికి స్వతంత్రం



తెచ్చిన, దేశాన్ని మునుముందుకు నడిపిన పార్టీ కాంగ్రెస్. రెండవది దేశాన్ని హిందుత్వ దేశంగా మార్చడానికి కంకణం కట్టుకున్న మతతత్వ పార్టీ బి.జె.పి, మూడవది అంతర్జాతీయ మానవీయ భావజాలం, శాస్త్రీయ ఆలోచనా ధోరణి, ఆర్థిక సమానత్వ భావజాలం ఉన్న కమ్యూనిస్టు పార్టీ. నాలుగవది సామాజిక న్యాయం, బహుజన రాజ్యాధికారం ధ్యేయంగా కొనసాగుతున్న బి.యస్.పి స్వాతంత్ర్యానంతర సమయంలో రెండవ స్థానంలో ఉన్న కమ్యూనిస్టు పార్టీ క్రమక్రమంగా బలం కోల్పోయి ఒకటి రెండు రాష్ట్రాలకే పరిమితమైంది. పార్లమెంటరీ కమ్యూనిస్టు పార్టీల్లో ప్రస్తుతం కొంత బలంగా ఉంది సి.పి.ఎం మాత్రమే. 85 శాతం బహుజనుల రాజ్యాధికారాన్ని కోరుకుంటున్న బహుజన సమాజ్ పార్టీ దేశమంతటా విస్తరించి బలంగా ఉంటే ఈ దేశాన్నేలాల్సిందే. కాని ఆ పార్టీ ఒక్క రాష్ట్రానికే పరిమితమై మిగతా రాష్ట్రాల్లో నామావశిష్ఠంగా ఉంది. ఈ రెండు పార్టీలు బలహీనంగా ఉండడం వల్ల అనేక ప్రాంతీయ పార్టీలు పుట్టుకొచ్చాయి. కాంగ్రెస్, బి.జె.పి.లు దేశాన్నేలుతున్నాయి. గత కొన్నేండ్ల నుంచి ఈ పార్టీలు కూడా యు.పి.ఎ, ఎన్.డి.ఎ కూటములుగా దేశాన్నేలుతున్నాయి. ప్రస్తుతానికైతే ఈ రెండు పార్టీలు మాత్రమే వందకుపైగా సీట్లను సంపాదించి దేశాన్నేలగలిగే స్థితిలో ఉన్నాయి.

స్వాతంత్ర్యానంతరం భారతదేశాన్ని యాబై సంవత్సరాలకు పైగా ఏలింది కాంగ్రెస్. లౌకిక, ప్రజాస్వామిక, ప్రగతిశీల శక్తులు, సామాజి శక్తులు ఎదగడాన్ని నిరోధించలేదు. అంబేడ్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని గౌరవించింది. సైంటిఫిక్, పారిశ్రామిక, సస్యవిప్లవాలకు దోహదం చేసింది. 15 శాతంగా ఉన్న అక్షరాస్యతను 75 శాతం వరకు పెంచింది. అంతర్గత ప్రజాస్వామ్యానికి, ప్రజాస్వామ్య విలువలను గౌరవించింది. భారీ పరిశ్రమలు, భారీ నీటి ప్రాజెక్టు, విశ్వవిద్యాలయాలు, అణుశక్తి రంగంలో స్వయంసమృద్ధిని సాధించింది.

విదేశాలతో సత్సంబంధాలను నెలకొల్పింది. నూటికి నూరు పాళ్ళు కాకున్నా దేశాన్ని ప్రజాస్వామిక విలువలతో, లౌకిక విధానంతో, పేదరిక నిర్మూలం ధ్యేయంగా, సస్యవిప్లవం లక్ష్యంగా, రాజ్యాంగ విలువలను కాపాడుతూ రాజ్యమేలింది. స్వాతంత్ర్యానంతరం ఈ దేశంలో జరిగిన అన్ని రంగాల అభివృద్ధికి కాంగ్రెస్సే కారణం. కాని గతంలో పాలించిన వాజ్‌పేయి నాయకత్వంలోని బి.జె.పి, గత ఐదేళ్ళుగా పాలిస్తున్న మోదీ బి.జె.పి ప్రభుత్వ రంగాన్ని నిర్వీ ర్యం చేశాయి. కార్పొరేటీకరణను ప్రోత్సహించాయి. విద్యను కాషాయీకరిస్తున్నాయి. దళిత, బహుజన, మైనారిటీ, ప్రగతిశీల శక్తులపై దాడులు చేస్తున్నాయి. జి.ఎస్.టి, నోట్ల రద్దు, రాఫెల్, ఆర్.బి.ఐ, సి.బి.ఐ, అనేక ఆర్థిక పరమైన కుంభకోణాలతో దేశం మధ్య యుగాల్లోకి పయనిస్తోంది. వీరికి మనిషికంటే మతం ముఖ్యం. సెంటిమెంట్లను రెచ్చగొట్టడం ముఖ్యం. వీరికి రాజ్యాంగంపై నమ్మకం లేదు. కోర్టులపై అజమా యిషీ చలాయించడం వీరి నైజం. అన్ని రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామ్యాన్ని భ్రష్టుపట్టించి అయో ధ్య, మతం, హిందుత్వం సెంటిమెంట్లను రెచ్చగొట్టి గెలువాలని చూస్తుంది బి.జె.పి. మళ్ళీ బి.జె.పి గెలిస్తే దేశం అంధకార మధ్యయుగాల్లోకి వెళ్ళడం ఖాయం.

2019 సారస్వత ఎన్నికల్లో బి.జె.పి ఓటమి సామాజిక, చారిత్రక, రాజకీయావసరం. ఈ అవసరాన్ని గుర్తించే బి.జె.పి.యేతర ప్రజాస్వామిక, లౌకిక, ప్రగతిశీల భావజాలం గల పార్టీలన్నీ కాంగ్రెస్ నేతృత్వంలో ఏకమవుతున్నాయి. విడివిడిగా బహుముఖ పోటీలో మతతత్వ శక్తుల నోడించడం కష్టం. అందుకే కొన్ని నెలల నుండి రాహుల్, ఇటివలి కాలంలో చంద్రబాబు నాయుడు వివిధ రాష్ట్రాల్లోని పార్టీలను ఏకం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా బి.జె.పి వైఫల్యాలను ఎండగట్టి రాహుల్ ఉప ఎన్నికల్లోనూ, అసెంబ్లీ ఎన్నికల్లోనూ అద్భుత విజయాలను నమోదు చేశాడు. కాంగ్రెస్‌తో లౌకిక, ప్రజాస్వామ్య, సామాజిక, బహుజన, ద్రవిడ, తృణమూల్ లాంటి ప్రాంతీయ, ప్రగతిశీల కమ్యూనిస్టు శక్తుల ఐక్యత మతతత్వ బి.జె.పి అలయెన్సును ఖచ్చితంగా ఓడిస్తుంది. బి.జె.పి, కాంగ్రెస్ రహిత ప్రభుత్వం అనేది ఓ భ్రమ. ఈ సమయంలో అది అసలే సాధ్యం కాదు.

డాక్టర్ కాలువ మల్లయ్య
91829 18567


విప్లవ దీపశిఖ

చరిత్రను వెనక్కి నడిపించే ప్రతిఘాతక శక్తుల విష కౌగిలి నుంచి చరిత్రను ముందుకు నడిపించాల్సిన ప్రగతిశీల జననేతలు, ప్రతిభామూర్తులు, వైతాళికశక్తులు విధిగా ఉదయించి తీరాల్సిన కాలమది. ఆనాడు పీష్వాలుపాలిస్తున్న మరాఠా రాజ్యము స్వార్థపరతకు, అసూయా ద్వేషాలకు, కులతత్వానికి నెలవుగా ఉండేది. దేశ చరిత్రలో నిమ్న వర్గాలపై, రైతులపైస్త్రీలపై, కనివిని ఎరుగని వివక్షతను హింసను ప్రయోగిస్తున్న కాలమది. రెండవ బాజీరావు పరిపాలన కాలంలో ఇది మరింతగా విషమించిసంస్కృతి విషపరిణామముతో, మత కాఠిన్యంతో ప్రజలంత నిస్సహాయంగా బాహ్యంగా, మానసికంగా, భాదలననుభవించి సమాజ క్షీణావస్థకు పతనానికి దారి తీస్తున్న చీకటి కాలమది. ఈ నేపథ్యంలో కింది వర్గాల ప్రజలకు సాంఘీక, రాజకీయ రంగాలలో నూతనోత్తేజాన్ని, అభ్యుదయకరమైన ఆలోచనలను, ఆచరణను ఇవ్వడానికి ఓ సామాజిక విద్యా దీప స్థంభాన్ని అందించాల్సిన చారిత్రక కర్తవ్యం అనివార్యంగా మరాఠా రాజ్యంపై కూడ పడింది. చారిత్రక వైతాళికులను ప్రసవించాల్సిన చారిత్రక కర్తవ్యాన్ని చరిత్ర మాత చేపట్టి పురిటి నొప్పులు భరించి కనిపెంచిన విప్లవ వైతాళికురాలు సావిత్రిపూలే. బహుజన సమాజంతో పాటు, అన్నివర్గాల స్త్రీలు 'ఓనమాలు' కూడ దిద్దలేని అజ్ఞానం, మూఢ నమ్మకాలు రాజ్యమేలుతున్న అంధకార యుగంలో వేగుచుక్కగా ఉదయించిన సావిత్రిపూలే 1831 జనవరి 3వ తేదీన మహారాష్ట్రలోని సతారా జిల్లాలో గల నయగావ్ గ్రామంలో జన్మించారు. బాల్యం నుండే సహజాతంగా అబ్బి న పట్టుదల, కరుణ, సమత, జిజ్ఞాస వంటి గుణాలు భర్త జోతిరావ్ సహచర్యంలో మరింతగా వికాసం చెంది జీవితాంతం శ్రేయోమార్గంలో శ్రమించిన భారతమాత ప్రియ పుత్రిక సావిత్రిభాయి పూలే.

మరాఠ ప్రాంతంలో పీష్వాల పాలన అంతమై, ఆంగ్లేయుల ఆధీనంలోకి వచ్చినా కూడా గ్రామాలలో ఆదిపత్య వర్గాల స్వభావం, పాలనాస్వరూపం మారలేదు. 1813 చార్టర్ చట్టం, 1835 మకాలే విద్యావిధానంతో బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం ఐరోపా విజ్ఞానాన్ని, శాస్త్రీయ విద్యావ్యాప్తికి కృషి చేయడం ప్రారంభించింది. ఫలితంగా కింది జాతుల ప్రజలకు విద్యావకాశాలకు కొంత ప్రోత్సహం లభించింది. ఈ అవకాశాన్ని అంది పుచ్చుకున్న జ్యోతిరావు తన విద్యాభ్యాసాన్ని ప్రభుత్వ, స్కాటిష్ బడులలో మరాఠలో, ఆంగ్లంలో విద్యను నేర్చుకున్నాడు.

అమెరికన్ స్వాతంత్రోద్యమ నేత జార్జ్ వాషింగ్‌టన్ పోరాట పటిమ, జాన్‌స్టువర్ట్ మిల్ గ్రంథం 'ఆన్‌లిబర్టీ' లో గల ఉదాత్త ప్రజాస్వామిక భావాలతో ప్రేరేపితుడైన జోతిరావు పూలే సావిత్రిభాయికి సహచరుడిగా లభించడం మహత్తరమైన ఘట్టం. ఈ నమూన జంట భారతదేశ సాంఘిక విద్యవిప్లవానికి తమ శక్తినంత ధారపోసి నిజమైన జీవితానందం, నైతికసౌందర్యం, మానవ విమోచన ఉద్యమాలలో ఉన్నదని గుర్తించి, దారిదీపాలుగా వెలిగి, ఆ వెలుగును తర్వాత తరాలకు అందించి, అంబేద్కర్‌కు స్ఫూర్తిని కల్గించి, తమ త్యాగ ఫలితాలను అనుభవిస్తున్న కోట్లాది హృదయాలలో దేదీప్యమానంగా వెలుగుతూ తమ జన్మను పూలే దంపతులు సార్థకం చేసుకున్నారు.

జోతిరావు పూలే అహమ్మద్‌నగర్ వెళ్ళినప్పుడు అక్కడ అమెరికన్ మిషనరీవారు ఆడపిల్లల కోసం నడిపే బడిని చూసి ఎంతో ఆకర్షితుడై సమాజ ఆంక్షలను ధిక్కరిస్తూ తనకు వచ్చిన విద్యను సావిత్రి భాయికి నేర్పించాడు. అనతి కాలంలోనే మరాఠి, ఆంగ్లంలో చదవడం, రాయడం నేర్చుకుంది. ఇది ఆమె జీవితాన్ని గొప్ప మలుపు నిచ్చింది. వెంటనే పూలె దంపతులు పునేలోని బుధవారపేటలో బాలికా పాఠశాలను 1848 జనవరి 1న ప్రారంభించారు. బాలికల పాఠశాల కావడంతో పని చేసేందుకు మగవారెవరూ ముందుకు రాలేని స్థితిలో తనే తొలి మహిళ ఉపాధ్యాయురాలిగా, ముఖ్య ఉపాధ్యాయినిగా పాఠశాలను ధైర్యంగా నిర్వహించింది. ' విద్య లేక వివేకం తగ్గింది, వివేకం లేక నీతి తగ్గింది. నీతి లేక పురోగతి తగ్గింది, పురోగతి లేక సంపద తగ్గింది, సంపద లేకశూద్రులు, స్త్రీలు వెనుకబడి పోయారు. ఇంత అనర్థం ఆ విద్య వల్ల జరిగిందని ప్రజలకు ప్రభోదిస్తూ చైతన్యపరుస్తూ, మనువు పెట్టిన ఆంక్షలన్ని నిజం కాదు, వాటిని ఇప్పుడు పాటించవలసిన అవసరం లేదు, రండిచదువుకోండి, మేము మీకు చేయూతనిస్తాం, మమ్ములని అనుసరించండి, చదువు మీకు ఆనందాన్ని, విజ్ఞానాన్ని ఇస్తుంది అని ప్రచారం చేస్తూ బాలికలను బడికి తీసుకొని వచ్చేవారు. బాలికలకు ఆటపాటలు నేర్పించి వారి అభిమానాన్ని ప్రేమను సంపాదించి వారిని చదువు వైపు మరలించేది. పిల్లలకు తన హృదయాన్ని అంకితం చేసివారు నిరంతరం ప్రేమ, సంతోషాలలో ఉండేటట్లు చేసి పాఠశాలను సంతోషచంద్రశాలగా మార్చి వారి మానసిక వికాసానికి శక్తియుక్తులను ఉపయోగించేది. సంప్రదాయ వాదుల అవహేళనల, చీత్కారాల, అవమానాల, దాడుల మధ్య ఏ మాత్రం చలించక 'ప్రాణం పోయిన సరే లక్షసాధనలో వెనక్కి వెళ్ళను' అంటూ కర్తవ్య దీక్షలో ముందుకు సాగారు. 1846 నుండి 1876 వరకు పూలే జంటయాభైకి పై పాఠశాలలను శూద్రులు, అతి శూద్రులు, బాలికల కోసం స్థాపించారు. వీరి కృషి ప్రభుత్వాన్ని, ఇతర సంస్కర్తలను కదిలించి అనేక పాఠశాలల స్థాపనకు దారి తీసింది. హంటర్ కమీషన్ (1882)కు విజ్ఞాపనపత్రాన్ని సమర్పిస్తూ సమాజ సంపద సృష్టికర్తలైన శ్రామిక వర్గాలకు అందుబాటులో విద్య, ఉపాధ్యాయ వృత్తిలో అన్ని వర్గాలకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ విధంగా తమ అస మాన చలనశీలతతో భారత ప్రజాతంత్ర విద్యా విప్లవానికి ప్రారంభకులుగా చరిత్రలో నిలిచారు.



సావిత్రిభాయి స్వయంగా స్త్రీలలో చైతన్యం పెంపొందించేందుకు, మహిళాసేవామండలిని ప్రారంభించింది. అంటరానితనం నిర్మూలన, సతి, బాల్యవివాహం, వైదవ్యం, ఆడశిశు హత్యలు వంటి మూఢ సంప్రదాయాలను రూపుమాపటానికి భారత్‌లో స్థాపించిన తొలి సంస్థ. ఈసంస్థ 1852 జనవరి 14న మకరసంక్రాంతి సందర్భంగా 'సార్వజనిక్ తిలగుండ్ సమారోహ్' అనే ఉత్సవాన్ని కులమతాల కతీతంగా భాగస్వామ్యం చేసి నిర్వహించింది. హేతువాదం, మానవవాదంపునాదులుగా సమాజం పురోగమించడం కోసం శాయశక్తులా ప్రయత్నంచేసింది. వితంతువులు, అత్యాచార భాధితులు, వారి పిల్లలకు ఆశ్రయంకోసం 'బాల హత్య ప్రతిబంధక్ గృహాన్ని 1853 జనవరి 1 న ఏర్పాటు చేసింది. వారికి ధైర్యం చెప్పి ఆత్మ విశ్వాసాన్ని నింపి ఆత్మహత్యలకు పాల్పడకుండా చూసేది. వీటితో పాటు జోతిరావ్ నిర్వహించిన రైతాంగ, కార్మిక హక్కుల పోరాటాలలో, 'సత్య శోధక్ సమాజ్' నిర్వహణలో క్రియాశీలపాత్రను పోషించింది.

సాహిత్యం ద్వారా కూడ సావిత్రి తన సంఘ సంస్కరణ భావాలనుప్రచారము చేసారు. తన కవితలను, వ్యాసాలను, లేఖలను 'కావ్యపూలే', 'సుబోధ్ రత్నాకర్' అనే గ్రంథాలలో ప్రచురించారు. తన రచనల ద్వారా ఆధిపత్య వర్గాల కుట్రను పటాపంచలు చేసి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించారు. రాయికి కుంకుమ పెట్టి, నూనెలో ముంచి, దేనినైతే దేవత అంటున్నారో, నిజానికది రాయే కదా అంటూ రాళ్ళకు మొక్కితే పిల్లలుపుడితే, మరి స్త్రీ, పురుషులు పెళ్ళెందుకు చేసుకుంటారు అని ప్రశ్నించారు. అమ్మ గురించి రాస్తూ ఆమె ముందు సముద్రం కూడ చిన్నబోతుంది, ఆమె ముందు ఆకాశం కూడ తలదించుకుంటుంది అని ఆత్మీయంగా రాశారు. అజ్ఞానం గురించి రాస్తూ 'శత్రువొక్కటి మనందరికి, దానిని తరిమికొడదాం' ఆ దుష్టశత్రువు పేరు అజ్ఞానం, దాని గొంతుపిసికి జీవితం నుండి పారద్రోలుదాం అని చైతన్య గీతికలు రాశారు.

1890లో పూలే మరణం తర్వాత దు:ఖాన్ని దిగమింగుకొని అతని సామాజిక చైతన్య ఆశయ సాధన కార్యక్రమాలను కొనసాగించారు. 1896లో మహారాష్ట్రలో కరువు వచ్చినప్పుడు ప్రభుత్వం ద్వారా సహాయ కార్యక్రమాలు జరిగేందుకు విశేషకృషి చేశారు. విద్యా సంస్థలలో చదువుకునే పిల్లలను 'ఈ పిల్లలే ఈ దేశానికి ఆస్తి, ఈ దేశ ఆస్తులే నాఆస్తి' అని కరువు కోరల నుండి పిల్లలను కాపాడుకుంది. కరువు తర్వాత ప్లేగు వ్యాధి బారిన పడిన ప్రజలకు సేవలను అందించింది. విరామమెరగని సేవల వలన ఆరోగ్యం క్షీణించి 1897 మార్చి 10న సావిత్రిభాయి మహాపరినిర్వాణం చెందింది.

150 సంవత్సరాల క్రితమే ఈ భారతవనిలో మానవుడు మానవునిగా మనగలగాలని, ప్రతి మనిషికి ఒకే విలువ ఉండాలని, విద్య, ఆరోగ్యం ప్రజలహక్కు అని వంటి గొప్ప లక్ష్యాలతో సామాజిక విప్లవాన్ని ప్రారంభించి అనేక విజయాలను మనకు సమకూర్చిన పూలే దంపతుల ఆశయాల సంపూర్ణసాధనకు పరిశ్రమించాల్సిన బాధ్యత పౌర సమాజం, ప్రభుత్వంపై ఉన్నది.

పాఠశాల డ్రాప్ అవుట్స్‌లోబాలికల శాతం 63.5% గా ఉంది. విద్య, ఆరోగ్యం, ఉత్పాదక రంగం, రాజకీయ రంగములో స్త్రీల భాగస్వామ్యం ఆధారంగా ప్రపంచ ఆర్థిక వేదిక రూపొందించే లింగ వ్యత్యాస సూచిక-2017లో 108వ స్థానం ఉంది. సావిత్రి పూలే జీవితం ఉపాధ్యాయులకు సంఘ సంస్కర్తలకు సామాజికకార్యకర్తలకు నిరంతర చోదకశక్తిగా ప్రవహించే ఉత్తేజంలా పనిచేస్తుంది. విముక్తికి విద్య సాధనమని, పీడనకు గురవుతున్న వారిలో మార్పును, చైతన్యాన్ని సంతరిపజేస్తుందని తన కార్యాచరణతో నిరూపించి, అలాగేప్రజల దీర్ఘకాలపు బాగు కోసం ఇవాళ త్యాగం చేద్దామనే రాజకీయ సామాజిక గుణానికి నిలువెత్తు ప్రతీకైన సావిత్రి మార్గాన్ని అనుసరించి అభివృద్ధి ఫలాలు అందరికి అందే సమగ్ర సామాజిక విప్లవసాధనకు కృషిచేసి మానవాభివృద్ధి సూచికలో అగ్రస్థానం సాధించడమే వారికి మనమిచ్చే నిజమైన నివాళి.

అస్నాల శ్రీనివాస్
9652275560

(నేడు సావిత్రి పూలే జయంతి)




నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

- అంతర్జాతీయంగా వ్యతిరేక పవనాలతో తప్పని నష్టాలు
- దెబ్బతీసిన ఆటో మొబైల్ అమ్మకాల గణాంకాలు
- చైనా ఉత్పాదక రంగం నష్టాలతో మరింత దిగజారిన సూచీలు
- బీఎస్ఈలో ఇంట్రాడే కనిష్టం 520 పాయింట్లు
- సెనెక్స్ 363 పాయింట్ల నష్టానికి 35,891 పాయింట్ల వద్ద ముగింపు
- 117 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ 10,792 పాయిట్ల వద్ద ముగింపు



ముంబై: దేశీయ సూచీలు కొత్త సంవత్సరం రెండో రోజు నష్టాలను నమోదు చేశాయి. బుధవారం ఒక్క రోజులోనే బీఎస్ఈ సెనెక్స్ 363 పాయింట్లు (ఒక శాతం) నష్టాన్ని నమోదు చేసింది. దీంతో సెనెక్స్ 36 వేల మార్కును కోల్పోయి 35,891 వద్ద సెషన్‌ను ముగించింది. జాతీయ స్టాక్ ఎక్స్చేంజి బెంచ్‌మార్క్ సూచీ నిఫ్టీ సైతం 117 పాయంట్ల నష్టానికి 10,800 మార్క్‌ను కోల్పోయి..10,792.50 వద్ద ట్రేడింగ్ ముగించింది. ముఖ్యంగా ఆటో మొబైల్, మెటల్ రంగ షేర్ల పతనంతో బుధవారం నాటి ట్రేడింగ్‌లో భారీ నష్టాలు నమోదయ్యాయి. ఆసియా మార్కెట్లు ప్రతికూల సంకేతాలు అందివ్వడంతో నష్టాలు మరింత పెరిగినట్లు స్టాక్ బ్రోకర్లు తెలిపారు. ఆటో మొబైల్ రంగానికి సంబంధించి డిసెంబర్ నెలకు గాను ఆటోమొబైల్ రంగ అమ్మకాలను సియామ్ జనవరి 1న విడుదల చేయడంతో క్షీణించిన అమ్మకాల ప్రభావం త్రీవ్రంగా ఉన్నట్లు వారు పేర్కొన్నారు. చైనా ఉత్పాదక రంగం కూడా క్షీణించాయన్న వార్తలతో మెటల్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. దీంతో ఈ రెండు రంగాలు ప్రధాన నిరోధంగా ఏర్పడి స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. కాగా, ప్రారంభం నుంచే నష్టాల్లో ట్రేడ్ అయిన సూచీలు మిడ్ సెషన్‌లో సెన్సెక్స్ 400 పాయింట్లకు పైగా నష్టాన్ని నమోదు చేసింది. ఒక దశలో 520 కనిష్ట స్టాయిని తాకింది. నిఫ్టీ కూడా ఒక దశలో 175 పాయింట్లు పతనమై ఇంట్రాడే కనిష్ట సస్థాయిని నమోదు చేసింది. కాగా, సెషన్ మొత్తంలో కంటే చివరి అరగంటలో జరిగిన కొనుగోళ్లతో సూచీలు కాస్త పుంజుకుని భారీ నష్టాన నుంచి గట్టెక్కించాయి.

ఇక బుధవారం నాటి ట్రేడింగ్‌లో ఇన్ఫోసిస్, ఏషియన్‌పేయింట్స్, టీసీఎస్, ఇన్ఫ్రాటెల్, సన్‌ఫార్మా షేర్లు అరశాతం నుంచి 1.50 శాతం మేరా లాభపడ్డాయి. మరోవైపు ఎంఅండ్‌ఎం, వేదాంత, టాటాస్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఐషర్ మోటర్స్ షేర్లు 4.50 శాతం నుంచి 9.50శాతం నష్టాలను మూటగట్టుకున్నాయి.



క్షీణించిన రూపాయి



స్టాక్ మార్కెట్ల లాభనష్టాలతో సంబంధం లేకకుండా వరుసగా బలపడుతూ పోతున్న రూపాయి ర్యాలీకి బుధవారం ఎదురుగాలి వీచింది. బుధవారం ఒక్క రోజు ట్రేడింగ్‌లోనే 66 పైసలు క్షీణించి డాలర్‌కు రూ. 70 గా నమోదైంది.

ప్రపంచ మార్కెట్లూ పతనం

చైనా ఉత్పాదక రంగం క్షణించడంతో ఆ ప్రభావం ఆసియా మార్కెట్లన్నింటిపై పడింది. అంతే కాకుండా నూతన సంవత్సరం కావడంతో ఒక రోజు తర్వాత తిరిగి తెరుచుకున్న యూరప్, అమెరికా మార్కెట్ల సైతం నష్టాలను మూటగట్టుకున్నాయి. ఆ ప్రభావం దేశీయ సూచీలపై స్పష్టంగా కనిపించింది.

బీఎస్ఈలో టాప్ గైనర్స్

కంపెనీ	పాయింట్లు	ప్రస్తుత షేర్ ధర
సన్ ఫార్మా	+1.66	రూ. 440
టీసీఎస్	+1.09	రూ. 1,923
ఏషియన్ పేయింట్స్	+0.71	రూ. 1,381
ఇన్ఫోసిస్	+0.70	రూ. 669
ఎస్ బ్యాంకు	+0.22	రూ. 184
ఐసీఐసీఐ బ్యాంకు	+0.19	రూ. 364

బీఎస్ఈలో టాప్ లూజర్స్

కంపెనీ	పాయింట్లు	ప్రస్తుత షేర్ ధర
వేదాంతా	-4.48	రూ. 193
టాటా స్టీల్	-4.21	రూ. 493
ఎం అండ్ ఎం	-4.15	రూ. 741
టాటా మోటార్స్ డీవీఆర్	-3.22	రూ. 90
టాటా మోటార్స్	-2.91	రూ. 168
మారుతి సుజుకి	-2.74	రూ. 7,272
హీరో మోటోకార్స్	-2.64	రూ. 3,046
పవర్ గ్రిడ్ కార్పొరేషన్	-2.25	రూ. 195
భారతీ ఎయిర్‌టెల్	-2.11	రూ. 312
ఎస్‌బీఐ	-1.84	రూ. 293
కోల్ ఇండియా	-1.70	రూ. 237
హెచ్‌సీఎల్ టెక్నాలజీస్	-1.68	రూ. 945
హెచ్‌డీఎఫ్‌సీ	-1.52	రూ. 1,979
బజాజ్ ఫినాన్స్	-1.68	రూ. 2,616

ఎన్ఎస్ఈలో టాప్ గైనర్స్

కంపెనీ	పాయింట్లు	ప్రస్తుత షేర్ ధర
సన్ ఫార్మా	+1.50	రూ. 440
టీసీఎస్	+1.08	రూ. 1,923
ఏషియన్ పేయింట్స్	+0.86	రూ. 1,383
భారతీ ఇన్‌ఫ్రా	+0.76	రూ. 264
ఇన్ఫోసిస్	+0.60	రూ. 669
టైటాన్ కంపెనీ	+0.45	రూ. 932
యూపీఎల్	+0.40	రూ. 756
ఐసీఐసీఐ బ్యాంకు	+0.23	రూ. 364
ఎస్ బ్యాంకు	+0.22	రూ. 184

ఎన్ఎస్ఈలో టాప్ లూజర్స్

కంపెనీ	పాయింట్లు	ప్రస్తుత షేర్ ధర
ఐషర్ మోటార్స్	-8.76	రూ. 21,162
జేఎస్‌డబ్ల్యూ స్టీల్	-5.02	రూ. 288
వేదాంతా	-4.43	రూ. 193
టాటా స్టీల్	-4.29	రూ. 493
ఎం అండ ఎం	-4.09	రూ. 741
హిందాల్కో	-3.68	రూ. 214
గెయిల్	-3.27	రూ. 350
టాటా మోటార్స్	-2.83	రూ. 168
మారుతి సుజుకి	-2.79	రూ. 7,267
హీరో మోటార్ కార్ప్	-2.59	రూ.3,046
బీపీసీఎల్	-2.52	రూ. 357
పవర్ గ్రిడ్	-2.38	రూ. 195

బ్యాంకుల విలీనానికి కేంద్రం ఓకే

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ రంగంలో ప్రధానంగా చెప్పుకునే భారతీయ స్టేట్ బ్యాంకు విలీనం తర్వాత మరోసారి కేంద్రం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. చాలా కాలంగా తెరపైనున్న మూడు ప్రభుత్వ బ్యాంకులు బ్యాంక్ ఆఫ్ బరోడా, విజయా బ్యాంకు, దేనా బ్యాంకుల విలీనానికిబుధవారం అమోద ముద్ర పడినట్లు న్యాయ శాఖా మంత్రి రవిశంకర్ ప్రకటించారు. ఈ మూడు బ్యాంకుల విలీన ప్రక్రియ ముగిశాక ఏర్పడే కొత్త బ్యాంకు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రెండో స్థానంలో భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థలో మూడు స్థానంలో నిలువనుంది. కాగా, మొదటి రెండు స్థానాల్లో ప్రభుత్వ రంగ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ప్రైవేటు రంగ ఐసీఐసీఐ బ్యాంకులు ఉన్నాయి. అయితే ఈ బ్యాంకుల విలీనం వల్ల ఆయా బ్యాంకుల ఉద్యోగులపై ఎటువంటి ప్రభావం ఉండబోదని రవిశంకర్ అన్నారు. అంతుకాకుండా బ్యాంకుల సేవలు విస్తరించడం, ఖాతాదార్లకు, శాఖాల నిర్వహనకు మేలు చేకూరనున్నట్లు ఆయన పేర్కొన్నారు. విలీన అనంతరం బ్యాంకులో దాదాపు 85 వేల మందికి పైగా ఉద్యోగులుండనున్నారు. అంతర్జాతీయ, జాతీయంగా ఆ బ్యాంకుకు 9,485 శాఖలు ఉంటాయి. తాజా నిర్ణయం ప్రకరారం 2019 ఏప్రిల్ 1 నుంచి నూతన బ్యాంకు కార్యకలాపాలు అందుబాటులోకి రానున్నాయి.



డిసెంబర్‌లో రాణించిన బజాజ్ ఆటో

న్యూఢిల్లీ: ప్రముఖ వాహన తయారీ కంపెనీ బజాజ్ ఆటో ద్విచక్ర వాహనాల విక్రయాలు 2018 డిసెంబర్‌లో 2,98,855 యూనిట్లగా నమోదయ్యాయి. అంతకు ముందు 2017 ఇదే సమయానికి ఈ సంఖ్య 2,28,762 యూనిట్లుగా ఉంది. దీంతో గత ఏడాది డిసెంబర్‌తో పోల్చుకుంటే వాహన అమ్మకాలు 31శాతం వృద్ధి చెందినట్లు కంపెనీ పేర్కొంది. కాగా, దేశీయంగా వీటి అమ్మకాలు 39 శాతం వృద్ధితో 1,57,252 యూనిట్ల విక్రయాలు నమోదైనట్లు బజాజ్ పేర్కొంది.



ద్విచక్ర వాహనాల అగ్రగామి సంస్థ హీరో మోటొకార్ప్ మాత్రం కాస్త డిసెంబర్ అమ్మకాల్లో కాస్త వెనకబడింఇ. కంపెనీ మొత్తం వాహన అమ్మకాలు డిసెంబర్‌లో 3.9 శాతం క్షీణతతో 4,53,985 యూనిట్లకు తగ్గాయి. 2017 డిసెంబర్ నెలలో కంపెనీ 4,72,731 యూనిట్ల వాహనాలను విక్రయించింది. లిక్విడిటీ సమస్య, టూవీలర్ ఇన్సూరెన్స్ ప్రీమియం పెరుగుదల వంటి అంశాలు ప్రతికూల ప్రభావం చూపాయని కంపెనీ తెలిపింది. మరో దిగ్గజ కంపెనీ టీవీఎస్ మోటార్ మొత్తం టూవీలర్ అమ్మకాలు 4 శాతం వృద్ధితో 2,58,709 యూనిట్లకు పెరిగాయి. కంపెనీ 2017 డిసెంబర్‌లో 2,47,591 యూనిట్లను విక్రయించింది. మరోవైపు రాయల్ ఎన్‌ఫీల్డ్ మొత్తం వాహన అమ్మకాలు ఏకంగా 13 శాతం మేర తగ్గాయి. 66,968 యూనిట్ల నుంచి 58,278 యూనిట్లకు క్షీణించాయి.

జీఎస్‌టీ వసూళ్లు తగ్గాయి

న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జిఎస్‌టీ) వసూళ్లలో తగ్గుదల చోటు చేసుకుంది. 2018 డిసెంబర్‌లో జీఎస్‌టీ వసూళ్లు 94,726 కోట్లుగా నమోదయ్యాయి. కాగా, అదే ఏడాది నవంబర్‌లో జిఎస్‌టీ వసూళ్లు రూ. 97,637 కోట్లుగా ఉన్నాయి. 2018 డిసెంబరు 30 నాటికి మొత్తం జిఎస్‌టీఆర్-3బి రిటర్న్‌ల నమోదు సంఖ్య 72.44లక్షలకు చేరినట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇటీవల వెల్లడించింది. కాగా, డిసెంబర్‌లో జీఎస్‌టీ మండలి కొన్ని వస్తువులపై జీఎస్‌టీని తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రభావం కారణంగా వచ్చే నెల గణాంకాల్లో కూడా జీఎస్‌టీ వసూళ్లు తగ్గోచ్చని నిపుణుల అభిప్రాయం.




రుణాల చెల్లింపు ఆలస్యం

ఎస్‌బీఐకి జెట్ వినతి



న్యూఢిల్లీ: నగదు కొరతతో సతమతమౌతున్న జెట ఎయిర్‌వేస్ షేర్లు బీఎస్ఈలో బుధవారం అత్యధికంగా ఐదు శాతం నష్టాలను నమోదు చేశాయి. కాగా, బ్యాంకుల కన్సార్టియంకు చెల్లించాల్సిన మొత్తాలకు కాస్త ఆలస్యం అవుతున్నట్లు ఇటీవల ప్రకటించడంతో ఆ ప్రభావం సంస్థ షేర్లపై కనిపించింది. ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న జెట్ ఎయిర్‌వేస్ ఉద్యోగులకు చెల్లించాల్సిన జీతాల విషయంలో కూడా ఆలస్యం చేస్తున్న విషయం తెలిసిందే. మరో పక్క జెట్‌కు వరుస నష్టాల విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రధాన రుణ దాత ఎస్‌బీఐ జెట్‌కు సంబంధించిన బ్యాలెన్స్ షీట్స్‌ను ఫోరెన్సిక్ ఆడిట్ చేయనున్నట్లు కూడా ఇటీవల ప్రకటించింది. ఇందుకు ప్రధాన కారణం 2018 మార్చి నుంచి ప్రతి త్రైమాసికానికి రూ. 1,000 కోట్ల చొప్పున జెట్ ఎయిర్ వేస్ నష్టాలను ప్రకటిస్తూ వస్తోంది. దీంతో ఎస్‌బీఐ ఆ నిర్ణయానికి వచ్చినకట్లు తెలుస్తోంది.



ఈపీఎఫ్ వడ్డీ రేట్ల పెంపునకు కేంద్రం సుముఖం

న్యూఢిల్లీ: దేశంలో సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) వడ్డీ రేట్లను పెంచేందుకు కేంద్రం సుముఖంగా ఉన్నట్లు కొన్ని పరిణామాల ద్వారా తెలుస్తోంది. సంస్థ వార్షిక అంతర్గత రివ్యూలో భాగంగా ఈ వడ్డీరేటు పెంచాలని భావిస్తున్నట్టు సమాచారం. 2018-19కు గాను వడ్డీమ రేటును 8.55 శాతంనుంచి పెంచేందుకు యోచిస్తోందట. దీంతో 6 కోట్ల మంది ఈపీఎఫ్ చందాదారులు లబ్ధిపొందనున్నారు. కగా, ఈ నెలాఖరులో జరిగే సెంట్రల్ బోర్డు సమావేశంలో స్పష్టమైన నిర్ణయాన్ని తీసుకోనున్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ ఫిబ్రవరిలో విడుదలయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఈపీఎఫ్‌వో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సభ్యుడు ప్రభాకర్ బనసూర్ వడ్డీరేటు పెంపునకు ఎక్కువ అవకాశం ఉన్నట్లు ఇటీవల తెలిపారు. కాగా, డిసెంబర్‌లోనే రేట్లు పెంపు కావాల్సిందని ఆడిటింగ్ కార్యకలాపాల వల్ల ఆలస్యమైందని మరొక సభ్యుడు కూడా తెలిపారు. కాగా 2017-18 ఆర్థిక సంవత్సరానికని గాను ఈపీఎఫ్ ఖాతాలపై వడ్డీరేటు 8.55 శాతంగా ఉంది.



కార్ల కంపెనీలు ఆకట్టుకోలేదు

- డిసెంబర్ నెలలో ఎక్కువగా తగ్గిన అమ్మకాలు

న్యూఢిల్లీ: 2018 చివరి నెలలో దేశీయ ఆటోమొబైల కంపెనీలు అంతగా రాణించలేదు. డిసెంబర్‌లో దేశీ ప్యాసింజర్ వాహన అమ్మకాలు అంతంత మాత్రంగానే నమోదయ్యాయి. మారుతి సుజుకి, టాటా మోటార్స్ అమ్మకాల్లో కేవలం 1 శాతం మేర మాత్రమే పెరిగాయి. టొయోటా విక్రయాల్లో రెండంకెల వృద్ధి నమోదయ్యింది. హ్యుందాయ్, హోండా అమ్మకాలు 4 శాతానికి పైగా పెరిగగా. మహీంద్రా విక్రయాలు తగ్గాయని సియామ్ పేర్కొంది.

లిక్విడిటీ తగ్గడం, రుణ రేట్ల పెరుగుదల, కొనుగోలు సెంటిమెంట్ బలహీనంగా ఉండటం, మార్కెట్‌లో కొత్త మోడళ్ల ఆవిష్కరణ లేకపోవడం వంటి అంశాలు డిసెంబర్‌లో కార్ల అమ్మకాలపై ప్రతికూల ప్రభావం చూపాయి. ఇంధన ధరలు తగ్గినా కూడా ప్రయోజనం లేకుండా పోయింది. అలాగే కార్ల కంపెనీలు, డీలర్లు అధిక డిస్కౌంట్లు ప్రకటించినా కూడా ఫలితం దక్కలేదు. దేశంలోని అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుకి సుజుకి.. దేశీ వాహన విక్రయాలు కేవలం 1.8 శాతం మాత్రమే పెరిగాయి. 1,19,804 యూనిట్లుగా నమదయ్యాయి. గతేడాది ఇదే నెలలో కంపెనీ వాహన విక్రయాలు 1,18,560 యూనిట్లుగా ఉన్నాయి. విటారా బ్రెజా, ఎర్టిగా, ఓమ్ని, ఎకో వ్యాన్ వంటి మోడళ్లు ఈ వృద్ధికి కారణంగా నిలిచాయి. వీటిని మినహాయించి చూస్తే కంపెనీ విక్రయాలు 4.7 శాతం మేర క్షీణించాయి.



హ్యుందాయ్ కార్ల అమ్మకాలు డిసెంబర్‌లో 4.6 శాతం వృద్ధితో 42,093 యూనిట్లకు ఎగశాయి. కొత్తగా మార్కెట్‌లోకి తీసుకువచ్చని శాంట్రో మోడల్ డిమాండ్ ఇందుకు కారణం. మహీంద్రా అండ్ మహీంద్రా అమ్మకాలు 3 శాతంమేర తగ్గాయి. ఈ కంపెనీ 2018 డిసెంబర్‌లో 15,091 యూనిట్ల ప్యాసింజర్ కార్లను విక్రయించింది. అంతకు ముందు ఏడాది (2017) ఇదే నెలలో కంపెనీ అమ్మకాలు 15,543 యూనిట్లుగా ఉన్నాయి. ఇక టాటా మోటార్స్ దేశీయ వాహనల అమ్మకాలు దాదాపు 1 శాతం వృద్ధితో 14,260 యూనిట్లకు పెరిగాయి. కంపెనీ గతేడాది ఇదే నెలలో 14,180 యూనిట్లను విక్రయించింది. జపాన్‌కు చెందిన టొయోటా కంపెనీ డిసెంబర్‌లో 11,830 యూనిట్లను విక్రయించింది. గతేడాది ఇదే నెలలోని అమ్మకాలు 10,793 యూనిట్లతో పోలిస్తే 10 శాతం అధికంగా నమోదయ్యాయి. హోండా కార్ల అమ్మకాలు 4 శాతం వృద్ధితో 13,139 యూనిట్లకు పెరిగాయి.

రియాలిటీ షో హోస్ట్‌గా..!


● వెంకటేష్

తెలుగు రియాల్టీ షో బిగ్ బాస్ మూడో సీజన్‌కు సిద్ధమవుతోంది. తొలి సీజన్‌లో ఎన్టీఆర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఆ సీజన్‌కు మంచి క్రేజ్ వచ్చింది. తర్వాత ఎన్టీఆర్ బిజీగా మారిపోవడంతో బిగ్‌బాస్ సీజన్ 2కు నాని వ్యాఖ్యాతగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. ఈ సీజన్‌లో నాని వ్యాఖ్యానంపై ... తన ప్రవర్తనపై చాలా రకాలైన విమర్శలను ఎదుర్కొన్నారు నాని. మూడో సీజన్‌కు నిర్వాహకులు ప్రీ ప్లానింగ్ చేసుకుంటున్నారు. ముఖ్యంగా వివాదాలకు దూరంగా క్రేజ్‌ను తెచ్చుకునేలా సీజన్ ఉండాలనుకుంటున్నారట. అందుకోసమని బిగ్‌బాస్ సీజన్ 3కి వెంకటేశ్‌ను హోస్ట్‌గా తీసుకోవాలనుకుంటున్నారని సినీ వర్గాల సమాచారం.

విజయ్ కోసం 16 మంది అమ్మాయిలు


● విజయ్

తమిళ్ హీరో విజయ్ 63వ సినిమాకు రంగం సిద్ధమవుతోంది. స్పోర్ట్స్ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని తెలుస్తోంది. జనవరి మూడోవారంలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. ఇందులో విజయ్ కోచ్ పాత్రలో కనిపిస్తారు. దానికోసం ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. విజయ్ హీరోగా 'తెరి', 'మెర్సల్' చిత్రాలను రూపొందించిన అట్లీ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన విశేషమేమిటంటే స్పోర్ట్స్ టీమ్ కోసం 16 మంది కొత్త అమ్మాయిలను ఎంపిక చేస్తున్నారట. నయనతార ఇందులో హీరోయిన్‌గా నటిస్తుంది. 10 సంవత్సరాల తర్వాత వీరిద్దరూ కలిసి నటించడం విశేషం. ఎజిఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. వచ్చే ఏడాది దీపావళికి ఈ సినిమాను విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు.

ఆయనే నాకు స్ఫూర్తి

– అశోక్ వల్లభనేని



రజనీకాంత్, కార్తీక్ సుబ్బరాజ్ కాంబినేషన్‌లో సన్ పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న చిత్రం 'పేట'. ఈ చిత్రాన్ని తెలుగులో అశోక్ వల్లభనేని జనవరి 10న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో అశోక్ వల్లభనేని మాట్లాడుతూ ''బస్ కండెక్టర్‌గా స్టార్ట్ అయిన రజనీ కాంత్‌గారు నేడు దక్షిణాది సూపర్‌స్టార్‌గా ఎదిగారు. రేపు కాబోయే ముఖ్యమంత్రి అని కూడా అంటున్నారు. ఆయన నాకు స్ఫూర్తి. దాని వల్లే రజనీకాంత్‌గారితో సినిమా చేయగలిగే స్థాయిని అందుకోగలిగాను. ఆయనలో ఎన్నో సేవాగుణాలున్నాయి. తమిళ ప్రజలకు ఎంతో మేలు చేసిన రజనీకాంత్‌గారు తెలుగు ప్రజలకు ఏం చేశారనే ప్రశ్న వస్తుంది. అందుకోసమని ఈ నెల 6న జరగబోయే 'పేట' ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో మంచి సేవను అందిస్తోన్న రెండు, మూడు అనాథ శరణాలయాలకు రజనీకాంత్‌గారి చేతుల మీదుగా నగదును చెక్స్ రూపంలో అందించబోతున్నాం. డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజ్‌గారు రజనీకాంత్‌గారికి వీరభక్తుడు. ఈ సినిమాతో కచ్చితంగా హిట్ కొడతాడని నమ్మకంగా ఉన్నారు. ట్రైలర్‌ను చూస్తే రజనీకాంత్‌గారు పాతికేళ్లు వెనక్కి వెళ్లిపోయారనిపించేంత గొప్పగా ఉంది. అనిరుధ్ వెర్సటైల్ మ్యూజిక్ అందించారు. నవాబ్, సర్కార్ తర్వాత తెలుగులో విడుదల చేస్తున్న మరో అనువాద చిత్రమిది. 'పేట' అంటే ఓ ప్రాంతం..ఏరియా అని చెప్పొచ్చు. తక్కువ థియేటర్స్‌లోనే సినిమాను విడుదల చేస్తున్నాం. అయితే సినిమా బావున్నప్పుడు థియేటర్స్ ఆటోమెటిక్‌గా పెరుగుతాయి. ఉదాహరణకు సోగ్గాడే చిన్ని నాయనా సినిమా తక్కువ థియేటర్స్‌లో విడుదలైనా, పెద్ద హిట్ అయ్యింది. మంచి సినిమా అనే నమ్మకంతో ఈ సంక్రాంతికి సినిమాను విడుదల చేస్తున్నాం. ఇప్పటికే 50 శాతం బిజినెస్ పూర్తయ్యింది. మరో 50 శాతం బిజినెస్ ప్రాసెస్‌లో ఉంది. తెలుగులో స్ట్రయిట్ సినిమాను ఈ ఏడాది ప్లాన్ చేస్తున్నాం. కథలు వింటున్నాను. మంచి కథ, హీరో దొరకగానే అనౌన్స్ చేస్తాం. లేకుంటే.. చిన్న బడ్జెట్ చిత్రాలు చేసుకుంటాను'' అన్నారు.

ఆ వార్తలో నిజం లేదు!


● కియారా అద్వానీ

బాలీవుడ్‌లో హీరోయిన్‌గా మంచి పేరు తెచ్చుకుంటూనే టాలీవుడ్‌లోనూ ప్రముఖ హీరోల సరసన నటిస్తున్న కియారా అద్వాని 'అర్జున్‌రెడ్డి' రీమేక్‌లోనూ నటిస్తోంది. 'కబీర్ సింగ్' పేరుతో హిందీలో రూపొందుతున్న ఈ సినిమాలో షాహిద్ కపూర్ హీరోగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో కియారా హీరోయిన్‌గా చేస్తోంది. తెలుగులో 'వినయ విధేయ రామ' చిత్రంలో రామ్‌చరణ్‌తో కలిసి నటిస్తోంది. ఇదిలా ఉండగా బాలీవుడ్ దర్శకుడు ఇంతియాజ్ అలీ తెరకెక్కించబోతున్న సినిమాలో కియారా హీరోయిన్‌గా నటించబోతోందనే వార్తలు వస్తున్నాయి. ఈ సినిమాలో కార్తీక్ ఆర్యన్ హీరోగా నటిస్తున్నారు. అయితే ఈ సినిమాలో తాను నటించడం లేదని ఇటీవల కియారా స్పష్టం చేసింది. ఈ సినిమాలో హీరోయిన్‌గా తాను నటిస్తున్నానని మీడియాలో వచ్చిన వార్తల్లో ఏమాత్రం నిజం లేదని ఆమె అన్నారు. కానీ, ఆ వార్త నిజం కావాలని తాను కోరుకుంటున్నట్టు తెలిపింది. ఈ సినిమాలో నటించమని తనను ఎవరూ సంప్రదించలేదని ట్విట్టర్ ద్వారా ఆమె వివరించింది.

పెళ్లి కళ వచ్చేసింది


● అమీ జాక్సన్

మోడలింగ్ నుంచి సినిమాల్లోకి వచ్చిన అమీ జాక్సన్ చేసింది తక్కువ సినిమాలే అయినా గ్లామర్ హీరోయిన్‌గా మంచి పేరు తెచ్చుకుంది. ఇప్పుడీ భామకు పెళ్ళి కళ వచ్చేసింది. బ్రిటన్‌కు చెందిన వ్యాపారవేత్త జార్జ్ పనాయటోతో ఆమె వివాహం జరగబోతోంది. కొంతకాలంగా వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారు. జాంబియాలో వీరిద్దరి నిశ్చితార్థం జరిగింది. ఈ విషయాన్ని అమీ జాక్సన్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తెలియజేసింది. '1 జనవరి 2019.. మన జీవితాల్లో కొత్త ప్రయాణం. ఐ లవ్యూ. నన్ను ఎల్లప్పుడూ సంతోషంగా ఉంచుతున్నందుకు ధన్యవాదాలు' అని పేర్కొంటూ ఫొటోను పోస్ట్ చేశారు. పెళ్లి ఎప్పుడు చేసుకోబోతున్నారనే విషయాన్ని మాత్రం అమె తెలియజేయలేదు. శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'ఐ', '2.0' చిత్రాల్లో నటించిన అమీ రామ్‌చరణ్‌తో 'ఎవడు' చిత్రంలోనూ కనిపించింది. అలాగే 'అభినేత్రి' చిత్రంలోనూ ఓ కీలక పాత్ర పోషించింది.

'వైదేహి' ట్రైలర్ విడుదల



యాక్టివ్ స్టూడియోస్ పతాకంపై ఎ.జి.ఆర్. కౌశిక్ సమర్పణలో రూపొందుతున్న చిత్రం 'వైదేహి'. ఎ.జననీ ప్రదీప్ నిర్మాత. ఎ.రాఘవేంద్ర ప్రదీప్ దర్శకుడు. ఈయన దివంగత నటుడు ఏవీయస్ తనయుడు. ఏవీయస్ జయంతిని పురస్కరించుని జనవరి 2న హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో ఈ సినిమా ట్రైలర్‌ను ఎన్.శంకర్ విడుదల చేశారు. ఏవీయస్ జయంతి సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ పసుపులేటి రామారావు కేక్ కట్ చేశారు. దర్శకుడు మాట్లాడుతూ ''మా నాన్నగారిని గుర్తుచేసుకోవడానికి ఓ మంచి అకేషన్ ఉంటే బావుంటుందనిపించింది. ఆయన పుట్టిన రోజున మా సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం ఆనందంగా ఉంది. మా నటీనటులు, టెక్నీషియన్లను చాలా ఇబ్బందిపెట్టాను. రాత్రింబవళ్లు షూటింగ్‌లు చేసేవాళ్లం. అయినా వారందరూ చిరునవ్వుతో పనిచేసేవారు'' అన్నారు. ఎన్.శంకర్ మాట్లాడుతూ ''ఏవీయస్‌గారు లేని లోటు ఇండస్ట్రీలో ఉంది. ఆయన తనయుడు రాఘవేంద్ర ప్రదీప్ తెరకెక్కించిన ఈ సినిమా ట్రైలర్ బావుంది. ఇప్పుడు ఇలాంటి జోనర్‌లో తెరకెక్కిన సినిమాలు 90 శాతం హిట్ అవుతున్నాయి'' అని తెలిపారు. పసుపులేటి రామారావు మాట్లాడుతూ ''ఏవీయస్‌గారితో నాకూ చక్కటి సాన్నిహిత్యం ఉంది. వాళ్ల అబ్బాయి దర్శకుడు కావడం ఆనందంగా ఉంది'' అన్నారు. మంచి పాత్రల్లో నటించినందుకు ఆనందంగా ఉందని నటీనటులు తెలిపారు.

నరేంద్ర మోదీగా...


● వివేక్ ఓబెరాయ్

తెలుగు, హిందీ, తమిళ్... ఇలా పలు భాషల్లో బయోపిక్స్ నిర్మాణం జరుగుతోంది. కల్పిత కథల కంటే నిజ జీవిత కథలను తమ సినిమాల కోసం ఎంపిక చేసుకుంటున్నారు దర్శకనిర్మాతలు. ఈ నేపథ్యంలో బాలీవుడ్‌లో మరో బయోపిక్‌కి శ్రీకారం చుట్టబోతున్నారు. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోది జీవిత కథ ఆధారంగా ఓ సినిమా తెరకెక్కబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ సినిమాలో ప్రధాని నరేంద్ర మోది పాత్రలో బాలీవుడ్ హీరో వివేక్ ఓబెరాయ్ నటించబోతున్నారని సమాచారం. బాక్సింగ్ క్రీడాకారిణి మేరికోమ్ బయోపిక్‌తో జాతీయ అవార్డును సొంతం చేసుకున్న ఒమంగ్ కుమార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తారని టాక్. ఈ సినిమా కోసం గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని లొకేషన్స్‌ని చిత్ర యూనిట్ చూస్తోందని సమాచారం. మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ బయోపిక్ రిలీజ్‌కు రెడీ అవుతున్న తరుణంలో ఇప్పటి ప్రధాని నరేంద్ర మోది బయోపిక్ తెరపైకి రావడం విశేషం. 'రక్తచరిత్ర, వివేగమ్' వంటి దక్షిణాది చిత్రాల్లో నటించిన వివేక్ ఒబెరాయ్ 'వినయ విధేయ రామ'లో విలన్‌గా నటించిన విషయం తెలిసిందే.

థ్రిల్ చేసే 'ఉన్మాది'



ప్రవీణ క్రియేషన్స్ ప్రై.లి. పతాకంపై రూపొందుతోన్న చిత్రం 'ఉన్మాది'. ఎన్.ఆర్.రెడ్డి కీలక పాత్రలో నటిస్తూ దర్శకత్వం వహించారు. ఎన్.రామారావు నిర్మాత. డేవిడ్ సంగీతం అందించిన ఈ సినిమా పాటలను రాజ్ కందూరి ఆవిష్కరించారు. ట్రైలర్‌ను ఎన్.శంకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఎన్.శంకర్ మాట్లాడుతూ ''ఇలాంటి సినిమాకు స్టోరి, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్, డైరెక్షన్ చేయడానికి నిజంగా చాలా ధైర్యం కావాలి. ఎన్.ఆర్.రెడ్డిగారు నిజంగా చాలా ధైర్యం చేసి సినిమా తీశారు. ట్రైలర్ చాలా బాగుంది. హీరోయిజం, విలనిజం రెండూ చూపించదగిన క్యారెక్టర్. టీం అందరికి ఆల్ ది బెస్ట్''అన్నారు. నిర్మాత రాజ్ కందుకూరి మాట్లాడుతూ ''ఎన్.ఆర్.రెడ్డిగారు మంచి క్రియేటివ్ డైరెక్టర్. డేవిడ్ మంచి పాటలు ఇచ్చారు'' అన్నారు. ఎన్.ఆర్.రెడ్డి మాట్లాడుతూ ''నేను స్వర్గీయ హరికృష్ణగారికి పెద్ద అభిమానిని, ఓరకంగా ఆయనే నా ఇన్‌స్పిరేషన్. స్టోరీ చాలా డిఫరెంట్‌గా ఉంది. ప్రేక్షకులు థ్రిల్ అవుతారు. మా ఆర్టిస్టులు టెక్నీషియన్స్‌కి నా సపోర్ట్ ఎప్పటికీ ఉంటుంది'' అన్నారు.

బెల్లంకొండ సరసన

క్రేజీ హీరో విజయ్‌దేవరకొండ సరసన 'టాక్సీవాలా' చిత్రంలో నటించిన తెలుగు అమ్మాయి ప్రియాంక జవాల్కర్‌కు ఇప్పుడు అవకాశాలు క్యూ కడుతున్నాయి. ఇప్పుడు ఈ అమ్మడు రవితేజ, విఐ ఆనంద్ కాంబినేషన్‌లో రూపొందబోయే పీరియాడిక్ చిత్రంలో ఓ హీరోయిన్‌గా నటిస్తుంది. తాజా సమాచారం ప్రకారం ప్రియాంకను బెల్లంకొండ గణేష్ హీరోగా తెరకెక్కబోయే సినిమాలో హీరోయిన్‌గా తీసుకోబోతున్నారని ఇండస్ట్రీ వర్గాల సమాచారం. ఫణి అనే కొత్త దర్శకుడు తెరకెక్కించబోయే ఈ చిత్రంలో పాత్ర కోసం ప్రియాంకను యూనిట్ వర్గం కలుసుకుంది. ప్రియాంక కూడా తన సుముఖతను వ్యక్తం చేసిందట. త్వరలోనే అధికారిక సమాచారం వెలువడనుంది.


● ప్రియాంక జవాల్కర్

ప[రీకర్ ఇంట్లో 'రఫేల్' ఫైళ్లు



- ఆ విషయం గోవా మంత్రే చెప్పారు
- మా దగ్గర సంభాషణ ఆడియో టేపు
- లోక్‌సభలో వినిపించేందుకు రాహుల్ యత్నం
- అనుమతించని స్పీకర్.. రెండుసార్లు మైక్ కట్
- సభలో గందరగోళం.. సభ్యుల అరుపులు కేకలు
- అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం
- ప్రధాని మోదీ, జైట్లీపై రాహుల్ ఘాటు విమర్శలు
- తిప్పికొట్టిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి.. మండిపాటు

న్యూఢిల్లీ, జనవరి 2: రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు అంశంపై లోక్‌సభ బుధవారం అట్టుడికిపోయింది. విపక్ష, అధికార పక్ష సభ్యుల ఆరోపణలతో దద్దరిల్లిపోయింది. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, బీజేపీ సభ్యుల మధ్య తీవ్ర వాగ్యుద్ధం జరిగింది. రఫేల్ ఒప్పందంపై చర్చ సందర్భంగా రాహుల్‌గాంధీ.. ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రఫేల్ డీల్‌కు సంబంధించిన రహస్యా దస్తావేజులు గోవా సీఎం, ఒప్పందం కుదిరినప్పుడు రక్షణ శాఖ మంత్రిగా ఉన్న మనోహర్ పారికర్ ఇంట్లో ఉన్నట్లు ఆ రాష్ట్ర మంత్రి విశ్వజిత్ రాణె చేసిన వ్యాఖ్యల టేపులను సభలో వినిపించేందుకు రాహుల్ యత్నించడం తీవ్ర గందరగోళానికి దారితీసింది. ఆడియో వినిపించేందుకు స్పీకర్ సుమిత్రా మహాజన్ అనుమతించలేదు. రాహుల్ మాట్లాడుతుండగా ఆయన మైక్‌ను రెండుసార్లు కట్ చేశారు. దాంతో.. విపక్ష, అధికార పక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. వాస్తవానికి ఆ ఆడియో టేపులో ఉందని ఇవాళ ఉదయమే కాంగ్రెస్ ఆరోపించింది. రాఫెల్ కథకు ఎన్నో రంధ్రాలు ఉన్నాయని, ప్రధాని కనీసం 5 నిమిషాలు కూడా రాఫెల్ గురించి మాట్లాడలేదని, అందుకే ప్రధాని పార్లమెంట్‌కు రావడం లేదని రాహుల్ అన్నారు. యావత్ దేశం రాఫెల్ అంశంపై ప్రధానిని ప్రశ్నిస్తోందని రాహుల్ అన్నారు. రఫేల్‌పై విపక్షాల ప్రశ్నలను ఎదుర్కొనే ధైర్యం ప్రధాని నరేంద్ర మోదీకి లేదని ఎద్దేవా చేశారు. రఫేల్‌పై తనను ఎవరూ ప్రశ్నించలేరని ప్రధాని చెప్పడం సరైంది కాదని, దీనిపై దేశ ప్రజలంతా ఆయనను ప్రశ్నిస్తున్నారన్నారు. రఫేల్ ఒప్పందానికి సంబంధించి రూ.1600 కోట్ల నూతన ధరపై రక్షణ మంత్రిత్వ శాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేసింది నిజం కాదా అని నిలదీశారు. 36 యుద్ధ విమానాల కొనగోలు కోసం చేపట్టిన కొత్త డీల్.. అన్ని నిబంధనలను తొక్కేసిందని రాహుల్ విమర్శించారు. రఫేల్ విమానాల ధర రూ. 526 కోట్ల నుంచి రూ. 1600 కోట్లకు ఎలా చేరిందని ఆయన ప్రశ్నించారు. పైసల కోసమా లేక దేశభక్తి కోసం ఇలా చేశారా అని రాహుల్ విమర్శించారు. హెచ్ఏఎల్ ఎన్నో ఏళ్ల నుంచి విమానాలను తయారు చేస్తోందని, అయితే ఎందుకు ప్రధాని తన మిత్రుడికి కాంట్రాక్టు అప్పగించారని, ముడుపుల కోసం ఎందుకు మోదీ ప్రయత్నించారన్నారు. రఫేల్ విమానాలు అత్యవసరం అని అన్నారు, కానీ ఇంత వరకు ఒక్క విమానాన్ని కూడా ఎందుకు తీసుకురాలేదన్నారు. ఏఎన్ఐకి ప్రధాని ఇచ్చిన ఇంటర్వ్యూ ముందుగా సిద్ధం చేసిందేనన్నారు. ఇంటర్వ్యూలో 90 నిమిషాలు మాట్లాడిన ప్రదాని రఫేల్‌పై మాత్రం ఇప్పటికీ బదులివ్వడం లేదని ఆరోపించారు.

గోవా మంత్రి ఆడియో టేప్..

రఫేల్ డీల్‌పై గోవా మంత్రి రాణే మాట్లాడిన ఫోన్ కాల్‌ను సభలో వినిపించేందుకు రాహుల్ ప్రయత్నించారు. టేపులను వినిపించేందుకు అనుమతి కావాలని కోరారు. దాన్ని స్పీకర్ మహాజన్ అడ్డుకున్నారు. ఆ సమయంలో ఆర్థిక మంత్రి జైట్లీ జోక్యం చేసుకున్నారు. కాంగ్రెస్ తప్పుడు టేపులను సృష్టించిందని, ఆ రికార్డులను సభలో వినిపించలేమని జైట్లీ అన్నారు. గోవా మంత్రి రాణే టేపు గురించి సభలో మాట్లాడరాదు అని స్పీకర్ కోరారు. తన ప్రసంగంలో అనిల్ అంబానీ పేరును ప్రస్తావించరాదు అని కూడా రాహుల్‌ను స్పీకర్ కోరారు. రఫేల్ కొనుగోలుపై జేపీసీ వద్దు అని, పార్లమెంట్ విచారణ అవసరం లేదని సుప్రీం వెల్లడించలేదని, ఆ డీల్ గురించి నిజం తెలవాలని రాహుల్ గాంధీ తెలిపారు. పర్రీకర్ పేరును ప్రస్తావించిన సమయంలో.. ఆయన్ను గోవా సీఎం అనరాదు అని, మాజీ రక్షణ మంత్రి అని సంబోధించాలని స్పీకర్ తెలిపారు. తామేమీ భయపడడం లేదని, రఫేల్‌పై జేపీసీ వేయాలని, రఫేల్ డీల్‌ను మోదీ నాశనం చేశారని, ఆ నిజం బయటకు రావాలని, దేశమంతా మోదీని నిందిస్తున్నదని రాహుల్ విమర్శించారు.

ఆరోపణలను ఖండించిన రాణే..



తనపై కాంగ్రెస్ చేసిన ఆరోపణలను గోవా మంతి రాణే తీవ్రంగా ఖండించారు. ఆ ఆడియో టేపును కావాలని సృష్టించారని పేర్కొన్నారు. గతవారం జరిగిన గోవా కేబినెట్ సమావేశం సందర్భంగా... రాఫెల్ డీల్‌కి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు, మొత్తం ఫైలు తన బెడ్రూంలోనే ఉన్నదంటూ పారికర్ చెప్పినట్టు సదరు ఆడియో క్లిప్‌లో వినిపిస్తోంది. వ్యక్తిగతంగా తనపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవంటూ మంగళవారం ఓ ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ పేర్కొన్న నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీ తాజా ఆరోపణలు చేయడం గమనార్హం.

కాగితం విమానాలు విసిరిన ఎంపీ..

రఫేల్ ఒప్పందంపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ సుస్మితా దేవ్.. సభలో అనుచితంగా వ్యవహరించారు. పేపర్ విమానాలు తయారు చేసిన ఆమె.. జైట్లీ మాట్లాడున్న సమయంలో ఆయన వైపు వాటిని విసిరారు. కొందరు ఎంపీలు తమ దగ్గర ఉన్న కాగితాలతో విమానాలను చేసి.. ఎంపీ సుస్మితా దేవ్‌కు అందజేశారు. వాటిని అందుకున్న ఆమె.. జైట్లీపై గురిపెట్టి విసిరారు. అయితే ఓ పేపర్ విమానాన్ని విసరగానే, కాంగ్రెస్ నేత సోనియా గాంధీ.. ఎంపీ సుస్మితాను అడ్డుకున్నారు. ఆమె వెన్నును తట్టి.. అలా చేయకూడదన్నారు.

అవి కల్పిత ఆధారాలు: పర్రీకర్

రఫేల్ డాక్యుమెంట్లు తన ఇంట్లో ఉన్నాయని రాహుల్ గాంధీ చేసిన ఆరోపణను గోవా సీఎం మనోహర్ పర్రీకర్ తీవ్రంగా ఖండించారు. ఆడియోటేప్ కృత్రిమంగా సృష్టించిన ఆధారామని మండిపడ్డారు. రఫేల్ అంశంలో వారు చెప్పినవన్నీ అబద్ధాలేనని సుప్రీంకోర్టు తేల్చి చెప్పిన నేపథ్యంలో ఇలాంటి కట్టుకథలు సృష్టిస్తున్నారన్నారు.



పరికర్ బెడ్రూంలో రఫేల్ ఫైళ్లు: సూర్జేవాలా



రఫేల్ జెట్ విమానాల కొనుగోలు ఒప్పందంపై కాంగ్రెస్ పార్టీ తన దాడితీవ్రతను పెంచింది. మాజీ రక్షణ మంత్రి, గోవా ముఖ్యమంత్రి మనోహర్ పరికర్ బెడ్రూంలో ఈ ఒప్పందానికి సంబంధించిన ఫైళ్లన్నీ ఉన్నాయని.. అలా గోవాకు చెందిన ఓ బీజేపీ మంత్రి చెబుతున్నట్లున్న ఆడియో రికార్డులు తమవద్ద ఉన్నాయని తాజాగా బాంబు పేల్చింది. ఫ్రెంచి కంపెనీ డసాల్ట్‌తో ఒప్పందం కుదిరినపుడు మనోహర్ పరికర్ రక్షణ మంత్రిగా ఉండేవారు. రఫేల్ ఒప్పందంపై జేపీసీ వేసేందుకు ప్రధాని నిరాకరించడానికి ఇదీ ఒక కారణమా అని కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సుర్జేవాలా ప్రశ్నించారు. గోవా మంత్రి విశ్వజిత్ రాణే మరో వ్యక్తితో మాట్లాడారంటున్న ఆడియో క్లిప్‌ను ఆయన విలేకరుల సమావేశంలో వినిపించారు. అయితే రాణే మాత్రం అది తన గొంతు కాదని, ఈ టేపును సృష్టించారని అన్నారు. తాను కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరినప్పటినుంచి తనను టార్గెట్ చేస్తున్నారని, ఈ విషయంలో తగిన దర్యాప్తు చేయించాలని తాను ముఖ్యమంత్రిని కోరానని రాణే అన్నారు. కాంగ్రెస్ గోవాలో పట్టుకోల్పోతోందని, అందుకే ఇలా లేనిపోనివి సృష్టిస్తోందని మండిపడ్డారు. తాను ఈ అంశంపై ఎప్పుడూ ఎవరితోనూ చర్చించనే లేదన్నారు. ఏకంగా మంత్రులకు, ముఖ్యమంత్రికి మధ్య కూడా పొరపొచ్చాలు సృష్టించే నీచానికి కాంగ్రెస్ పార్టీ దిగజారిందని మండిపడ్డారు. కాగా.. గత వారం జరిగిన గోవా మంత్రివర్గ సమావేశంలో.. రఫేల్ ఒప్పందానికి సంబంధించిన ఫైళ్లన్నీ తన బెడ్రూంలోనే ఉన్నట్లు పరికర్ చెప్పారని రాణే అన్నట్లుగా ఆ ఆడియోటేపులో ఉంది. ఇప్పుడు ప్రధానమంత్రి తమకు సమాధానం చెప్పాలని, రఫేల్ స్కాంలో ఏం రహస్యాలు ఉన్నాయని.. పరికర్ ఫ్లాటులోను, ఆయన బెడ్రూంలోను ఏయే రహస్యాలు దాగి ఉన్నాయో దేశం తెలుసుకోవాలనుకుంటోందని సుర్జేవాలా అన్నారు.

రఫేల్‌పై రివ్యూ పిటిషన్



- సుప్రీంలో యశ్వంత్‌సిన్హా, అరుణ్‌శౌరి, ప్రశాంత్‌భూషణ్ దాఖలు

న్యూఢిల్లీ, జనవరి 2: ఫ్రాన్స్ నుంచి రఫేల్ విమానాల కొనుగోలులో అవకతవకలు జరిగాయని దాఖలైన పిటిషన్‌లను తోసిపుచ్చుతూ డిసెంబర్ 14న ఇచ్చిన తీర్పును సమీక్షించాలని కోరుతూ మాజీ కేంద్ర మంత్రులు యశ్వంత్ సిన్హా, అరుణ్ శౌరి, న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌లు బుధవారం సర్వోన్నత న్యాయస్ధానంలో రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. ప్రభుత్వం సంతకం చేయకుండా సీల్డ్ కవర్‌లో ఇచ్చిన నోట్‌లో పేర్కొన్న అవాస్తవ అంశాల ఆధారంగా తీర్పు వెలువరించారని రివ్యూ పిటిషన్‌లో వారు ఆరోపించారు. ఓపెన్ కోర్టులో తమ పిటిషన్ విచారించాలని వారు విజ్ఞప్తి చేశారు. కాగా రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంలో భారీ అవకతవకలు జరిగినట్లు తమకు కనిపించడం లేదని గత ఏడాది డిసెంబర్‌లో సుప్రీం కోర్టు రఫేల్ ఒప్పందంలో మోదీ సర్కార్‌ను సమర్థిస్తూ తీర్పును వెల్లడించిన సంగతి తెలిసిందే.



తప్పులో కాలేశారు!

- రూ.11 లక్షల టికెట్.. 47 వేలకు అమ్మకం
- కాథే పసిఫిక్ ఎయిర్‌లైన్స్ పొరపాటు
- వియత్నం నుంచి కెనడా.. అమెరికా
- భారీ మొత్తంలో టికెట్ల అమ్మకాలు..
- తలపట్టుకుంటున్న ఎయిర్‌లైన్స్ సిబ్బంది

హాంకాంగ్, జనవరి 2: కాథే పసిఫిక్ ఎయిర్‌లైన్స్ సంస్థ పొరపాటున తప్పులో కాలేసింది. అత్యంత ప్రీమియం ధరకు అమ్మాల్సిన విమాన టికెట్లను పొరపాటున చాలా చవగ్గా అమ్మేసి ఇప్పుడు తీరిగ్గా తల పట్టుకుంటోంది. వియత్నాం నుంచి కెనడా, అమెరికాకు వెళ్లేందుకు ఉన్న కొన్ని విమానాల్లో ప్రీమియం కేబిన్ టికెట్ల ధరలు రూ.11.17 లక్షల నుంచి మొదలవుతాయి. వాటిని పొరపాటున రూ.47 వేలకు అమ్మేశారు. డా నాంగ్ నుంచి న్యూయార్క్‌కు ప్రీమియం కేబిన్ టికెట్లను ఇలా అమ్మేసుకున్నారు. ఆగస్టులో ప్రయాణాలు చేయడానికి వీటిని అమ్మినట్లు గేరీ లెఫ్ అనే ట్రావెల్ బ్లాగర్ తెలిపారు. హనోయ్ నుంచి వాంకూవర్‌కు బిజినెస్, ఫస్ట్‌క్లాస్ కలిపి ఉండే ఈ తరహా కేబిన్ టికెట్ వెయ్యి డాలర్లలోపే అమ్ముడైందని వన్‌మైల్ ఎట్ ఎ టైమ్ అనే సైట్‌లో రాశారు. ఇలా జరుగుతోందని తెలియగానే బంపర్ చాన్స్ అనుకుంటూ చాలామంది ప్రయాణికులు టికెట్లు చకచకా బుక్ చేసేసుకున్నారు. అయితే ఈ బుకింగులను కాథే పసిఫిక్ ఆమోదిస్తుందా.. లేదా అనే విషయం మాత్రం ఇంకా అధికారికంగా తెలియడం లేదు. ఇప్పటికే లో బడ్జెట్ విమానయాన సంస్థల నుంచి తీవ్ర పోటీని ఎదుర్కొంటున్న కాథే పసిఫిక్.. ఇప్పుడు పులిమీద పుట్రలా ఇదొచ్చి పడిందేమిటా అని తల పట్టుకుంటోంది. బహుశా తమ కంప్యూటర్లను ఎవరో హ్యాక్ చేసి ఇలా అమ్మించి ఉంటారని అనుమానిస్తున్నారు. గత సంవత్సరం కూడా ఇలాగే ఒకసారి వీళ్ల కంప్యూటర్లు హ్యాక్ కావడంతో 94 లక్షల మంది ప్రయాణికుల సమాచారం మొత్తం బయటపడింది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఎయిర్‌లైన్స్ సమాచార చౌర్యంగా రికార్డయింది. ఇప్పుడు టికెట్లు చవగ్గా అమ్ముడైపోయిన విషయం తమకు తెలుసని, మరిన్ని వివరాలు త్వరలో చెబుతామని సంస్థ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. సాధారణంగా జూలై, సెప్టెంబరు నెలల్లో న్యూయార్క్ నుంచి వియత్నాంలోని డా నాంగ్‌కు బిజినెస్ క్లాస్‌లో రావాలంటే కనీసం రూ.11 లక్షల వరకు టికెట్ ఉంటుందని కాథే పసిఫిక్ వెబ్‌సైట్‌లో ఉంది. కానీ, ఆగస్టు నెల వివరాలు మాత్రం అస్సలు లేనే లేవు. ఇంతకుముందు పలు విమానయాన సంస్థలు కూడా ఇలాంటి పొరపాట్లు చేశాయి. సింగపూర్ ఎయిర్‌లైన్స్ సంస్థ 2014లో ఇలాగే చేసింది. హాంకాంగ్ ఎయిర్‌లైన్స్ గతేడాది ఇలాగే తప్పు చేసి, ఎకానమీ ధరలకు అమ్మేసిన బిజినెస్ క్లాస్ టికెట్లను తప్పనిసరి పరిస్థితుల్లో అంగీకరించింది. అంటే, ఎకానమీ టికెట్ ధర పెట్టి టికెట్ కొని.. బిజినెస్ క్లాసులో ప్రయాణించారన్న మాట.

హిందువులు వేచి ఉండరు



- అయోధ్యలో రామాలయం కట్టాలి
- అందుకు ప్రభుత్వం చట్టం చేయాలి
- ఇప్పటికే 69 ఏళ్లుగా ఎదురుచూపు
- ప్రధాని మటలకు వీహెచ్‌పీ స్పందన

న్యూఢిల్లీ, జనవరి 2: అయోధ్యలో రామాలయం కోసం హిందువులు ఇక ఎల్లకాలం వేచి ఉండబోరని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తీర్పు వచ్చేవరకు తాము వేచి ఉంటామని ప్రధాని నరేంద్రమోదీ ఒక ఇంటర్వ్యూలో చెప్పిన మర్నాడే వీహెచ్‌పీ నుంచి ఘాటు స్పందన రావడం గమనార్హం. ఈ విషయం కోర్టులలో కొన్ని దశాబ్దాలుగా పెండింగులో ఉందని, ప్రభుత్వం ఇప్పటికైనా ఆలయ నిర్మాణం కోసం ఒక చట్టం చేయాలని వీహెచ్‌పీ వర్కింగ్ ప్రెసిడెంట్ అలోక్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆలయ నిర్మాణానికి ఏకైక మార్గం చట్టం చేయడమేనని, అందువల్ల రామాలయ నిర్మాణానికి మార్గం సుగమం చేయాలని కోరారు. హిందూ సమాజం ఇక నిరంతరం వేచి ఉండే పరిస్థితి లేదని ఆయన స్పష్టం చేశారు. కోర్టు తీర్పు వచ్చేవరకు ప్రభుత్వం ఆర్డినెన్సు తేబోదని ప్రధాని మోదీ ఏఎన్ఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పిన విషయం తెలిసిందే. అయితే ప్రభుత్వం చట్టపరంగా ఉన్న అవకాశాలన్నింటినీ చూస్తుందని మాత్రం అన్నారు. గత సంవత్సరం అక్టోబరు నెలలో సుప్రీంకోర్టు జనవరి మొదటి వారంలోనే రామ జన్మభూమి - బాబ్రీమసీదు వివాదాన్ని విచారణకు తీసుకుంటామని చెప్పింది. అయోధ్య భూ వివాదం కోర్టులలో గత 69 ఏళ్లుగా పెండింగులో ఉందని, దానిపై అప్పీళ్లు కూడా 2011 నుంచి పెండింగులో ఉన్నాయని, ఇది చాలా ఎక్కువ కాలమని అలోక్ కుమార్ చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, పార్లమెంటు సభ్యులకు నచ్చజెప్పేందుకు వీహెచ్‌పీ తన ప్రచారం, ప్రయత్నాలు కొనసాగిస్తుందని అన్నారు. జనవరి 31న కుంభమేళా సందర్భంగా జరిగే ధర్మ సంసద్‌లో పెద్దలు తదుపరి ఏం చేయాలో నిర్ణయిస్తారన్నారు.

శివాలయంలో ముస్లిం మంత్రి పూజలు

- పోఖ్రాన్‌కు వెళ్లిన సలే మహ్మద్
- అరగంట పాటు ప్రత్యేక పూజలు
- ఎన్నికల సమయంలోనూ పూజ



పోఖ్రాన్, జనవరి 2: రాజస్థాన్‌లోని అశోక్ గెహ్లాట్ ప్రభుత్వంలో ఉన్న ముస్లి మంత్రి సలేమహ్మద్ పోఖ్రాన్‌లోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. ముస్లిం మతపెద్ద గాజీ ఫకీర్ కుమారుడైన మహ్మద్.. తాను మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత తొలిసారి జైసల్మీర్ జిల్లాలోని పోఖ్రాన్‌కు వెళ్లారు. మంత్రి ఉన్నట్టుండి ఇలా రావడం, శివాలయంలో పూజలు చేయించడంతో అక్కడున్నవారంతా ఆశ్చర్యపోయారు. మంత్రి వచ్చిన విషయం, ప్రత్యేక పూజలు కూడా చేయించిన విషయాన్ని ఆలయ ప్రధాన పూజారి మధు చంగాని నిర్ధరించారు. అయితే, మహ్మద్ ఇక్కడకు రావడం ఇది తొలిసారి ఏమీ కాదని, గతంలో ఎన్నికల సమయంలో కూడా ఒకసారి ఆయన వచ్చారని తెలిపారు. ఆయనకు ఈ ఆలయంతో ఏదో అనుబంధం ఉందని అన్నారు. పూర్తి హిందూ ఆచారాల ప్రకారం అర్ధగంట పాటు ప్రత్యేక పూజలు మంత్రి చేయించారని చంగాని తెలిపారు. శివలింగానికి పంచామృతాలతో పూజలు చేశారని చెప్పారు. మత సామరస్యానికి పశ్చిమ రాజస్థాన్ ప్రాంతం మంచి ఉదాహరణ అని మంత్రి సలే మహమ్మద్ మీడియాకు తెలిపారు. హిందూ ముస్లింలందరికీ బాబా రాందేవ్‌జీ మీద మంచి విశ్వాసం ఉందన్నారు. తన వ్యక్తిగత విశ్వాసంతోనే తాను ఆలయానికి వచ్చానన్నారు.

కూతురి సజీవసమాధి

- కశ్మీర్‌లో ఓ తండ్రి యత్నం.. పట్టివేత

శ్రీనగర్, జనవరి 2: శ్రీనగర్‌లో ఒక వ్యక్తి తన కూతురిని బతికుండగానే పూడ్చి పెట్టేందుకు ప్రయత్నిస్తూ స్థానికులకు దొరికిపోయాడు. నౌహట్టా పాతబస్తీ ప్రాంతంలో షోపియాన్ జిల్లాకు చెందిన మంజూర్ హుస్సేన్ బన్వారీ అనేవ్యక్తి తన కూతురిని బతికుండగానే పూడ్చిపెట్టేందుకు ప్రయత్నించాడని స్థానికులు పోలీసులకు తెలిపారు. నిందితుడిని పట్టుకుని వారు పోలీసులకు అప్పగించారు. తన కూతురికి పుట్టుకతోనే ఏదో వ్యాధి ఉందని, దానికి చికిత్స చేయించేందుకు తన వద్ద డబ్బులు లేకపోవడంతో ఈ పని చేశానని అతడు అన్నట్లు ఒక పోలీసు అధికారి చెప్పారు. నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసిన పోలీసులు.. తర్వాత బెయిల్‌మీద విడిచిపెట్టారు. చిన్నారి పాపను చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్చారు.

పొగమంచుతో 12 రైళ్లు ఆలస్యం

- దేశ రాజధానిలో దట్టంగా మంచు
- ముందేముందో కనిపించని వైనం
- ఢిల్లీలో విపరీతంగా చలి గాలులు
- ఈనెల 5 వరకు ఇదే పరిస్థితి: ఐఎండీ

న్యూఢిల్లీ, జనవరి 2: దేశ రాజధానిలో పొగమంచు దట్టంగా అలముకోవడంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర విఘాతం కలిగింది. దాదాపు 12 రైళ్లు బాగా ఆలస్యమయ్యాయి. ముందు ఏముందో అసలు కనిపించకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. చాలా రైళ్లు రెండు నుంచి మూడు గంటలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఢిల్లీ ఇప్పటికే పొగమంచు దుప్పటిలో మునిగి ఉండగా.. మరోవైపు నగరంలో వాయు నాణ్యత కూడా 'తీవ్ర' విభాగంలోకి దిగజారింది. సిస్టం ఆఫ్ ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రీసెర్చ్(సఫర్) అంచనా ప్రకారం, నగరంలో మొత్తమ్మీద గాలి నాణ్యత సూచిక (ఏక్యూఐ) ఉదయం 8 గంటల వరకు 402గా నమోదైంది. అంటే ఇది ప్రమాదకరం, తీవ్రం అనే విభాగంలోకి వస్తుంది. ఎయిర్‌క్వాలిటీ ఇండెక్స్ 51 నుంచి 100 లోపు ఉంటే సంతృప్తికరం, 101-200 అయితే పర్వాలుదని, 201-300 అయితే దారుణం అని, 300-400 అయితే చాలా దారుణమని, 401-500 అయితే ప్రమాదకరమని అంటారు. దేశ రాజధానిలో చాలా ప్రాంతాలలో 400పైనే ఏక్యూఐ ఉంటోంది. ధీర్‌పూర్, ఢిల్లీ యూనివర్సిటీ, పీతంపురా, చాందినీ చౌక్, మథుర రోడ్డు ప్రాంతాలలో వరుసగా 425, 539, 482, 442, 433 చొప్పున ఏక్యూఐ నమోదైంది. అదే ఐజీఐ ఎయిర్‌పోర్టు, పుసా రోడ్డు, లోధీ రోడ్డులలో మాత్రం వరుసగా 363, 319, 308 చొప్పున నమోదై.. చాలా దారుణం అనే విభాగంలో ఉంది. ఢిల్లీలో కనిష్ఠ ఉష్ణోగ్రత 6.5 డిగ్రీలుగా నమోదైంది. ఇది ఈ సీజన్‌సగటు కంటే కూడా తక్కువే. మంగళవారం గరిష్ఠ ఉష్ణోగ్రత కూడా 23 డిగ్రీలు మాత్రమే ఉంది. ఇది సగటు కంటే మూడు డిగ్రీలు ఎక్కువ. కనిష్ఠ ఉష్ణోగ్రత 4 డిగ్రీలు ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఢిల్లీ, జాతీయ రాజధాని ప్రాంతంలో ఉష్ణోగ్రతలు బాగా పడిపోవడంతో గూడులేని నిరుపేదలు రోడ్ల మీద చాలా ఇబ్బంది పడుతున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన నైట్ షెల్టర్లు కిటకిటలాడుతున్నాయి. పశ్చిమ హిమాలయ ప్రాంతంలో వెస్ట్రన్ డిస్ట్రబెన్స్ ఏర్పడే అవకాశం ఉందని, దీనివల్ల పలు ప్రాంతాల్లో వర్షం, హిమపాతం సంభవిస్తాయని తెలిపారు.



సిడ్నీలో సవాల్



టెస్టు క్రికెట్‌లో చరిత్ర సృష్టించేందుకు కోహ్లీ సేన సిద్ధమైంది. తొలిసారి భారత క్రికెట్ టెస్టు జట్టు ఆస్ట్రేలియా గడ్డపై సిరీస్‌ను గెలుచుకునేందుకు చేరువైంది. తొలి టెస్టులో గెలిచి రెండో టెస్టులో ఓటమిపాలైనప్పటికీ కోహ్లీ సేన క్రుంగి పోలేదు. మూడో టెస్టులో రెట్టించిన ఉత్సాహంతో ఆడి ఆధిక్యం సంపాదించింది. వెన్ను నొప్పి గాయంతో బాధపడుతున్న కెప్టెన్ కోహ్లీ తన గాయాన్ని కూడా లెక్క చేయకుండా జట్టును అద్భుతంగా ముందుకు నడిపిస్తున్నాడు. నొప్పి కలిగినప్పుడు మైదానంలోనే ప్రథమ చికిత్స తీసుకుంటూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. నూతన సంవత్సరంలో కోహ్లీ సేన కొత్త చరిత్ర సృష్టించాలని అందరం ఆశిద్దాం...

- నేటి నుంచి ఇండియా, ఆస్ట్రేలియా మధ్య చివరి, నాల్గో టెస్టు
- డ్రా చేసుకుంటే చాలు
- ఈ సిరీస్‌లో 2-1తో టీమిండియా ఆధిక్యం
- తుది జట్టుకు ఇషాంత్ దూరం
- అశ్విన్, కుల్‌దీప్‌లకు చోటు

సిడ్నీ: చరిత్ర సృష్టించేందుకు టీమిండియా సిద్ధమైంది. గురువారమిక్కడ ఆస్ట్రేలియాతో జరగనున్న చివరి, నాల్గో టెస్టు మ్యాచ్‌లో కోహ్లీ సేన ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. నాలుగు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో టీమిండియా ఇప్పటికే 2-1 ఆధిక్యంతో ఉంది. జట్టులో అనేక ఫిట్‌నెస్ సమస్యలు ఉన్నప్పటికీ సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో (ఎంసీజీ) గెలిచి 3-1తో సిరీస్‌ను సొంతం చేసుకోవాలని టీమిండియా భావిస్తోంది. ఈ మ్యాచ్‌ను గెలవకపోయినా కనీసం డ్రా చేసుకున్నా ఈ సిరీస్ టీమిండియా వశమవుతుంది. మరోవైపు ఇంత వరకు హోం సిరీస్‌లో టీమిండియా చేతిలో ఓటమి ఎరుగని ఆస్ట్రేలియా జట్టు తొలిసారి ప్రమాదకరమైన స్థితిలో నాల్గో టెస్టులో బరిలోకి దిగనుంది. ఒకవేళ అదే జరిగితే హోం సిరీస్‌లో తొలిసారి ఇండియా చేతిలో ఓడిన జట్టుగా టిమ్ పెయిన్ సేన అపకీర్తిని పొందనుంది. 1947-48 నుంచి ఇప్పటి వరకు టీమిండియా ఆస్ట్రేలియాలో 10 సిరీస్‌లు ఆడింది. ఇందులో మూడు సిరీస్‌లను (1980-81, 1985-86, 2003-04) టీమిండియా డ్రా చేసుకుంది. మిగతా ఏడు సిరీస్‌లలో ఓటమిపాలైంది. అయితే ఆస్ట్రేలియాపై ఆధిక్యంతో చివరి టెస్టులో ఆడనున్న భారత తొలి కెప్టెన్‌గా విరాట్ కోహ్లీ ఘనత సాధించాడు. ఒకవేళ ఆస్ట్రేలియాలో ఈ టెస్టు సిరీస్ గనుక గెలిస్తే కోహ్లీ భారత క్రికెట్‌లో శిఖరాగ్రానికి చేరుకుంటాడు. మరోవైపు మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్‌లు లేని ఆస్ట్రేలియా బ్యాటింగ్ లైనప్ డొల్లతనం బయట పడుతుంది. అయితే తుది జట్టుపై కోహ్లీ కసరత్తులు చేయాల్సిన అవసరముంది. ఎందుకంటే ఈ మ్యాచ్‌లు 13 మంది సభ్యుల తుది జట్టును ప్రకటించినప్పటికీ సీనియర్ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ పూర్తి ఫిట్‌నెస్ సాధించలేదని కోహ్లీ చెప్పాడు. సిడ్నీలో ఆడే ఏ టెస్టు మ్యాచ్‌కైనా స్పిన్‌ను సంప్రదాయంగా భావిస్తారు. దీంతో అశ్విన్ ఫిట్‌నెస్‌పై తీవ్ర సమాలోచనలు జరుగుతున్నాయి. పొత్తి కడుపు ఎడమ వైపు నొప్పి కారణంగా అడిలైడ్‌లో అశ్విన్ సరిగా ఆడలేకపోయాడు. మరోవైపు ఎడమ వైపు పక్కటెముల నొప్పి కారణంగా ఇషాంత్ శర్మ నాలుగో టెస్టుకు దూరమయ్యాడు. దీంతో కీలకమైన చివరి టెస్టులోనూ అతడిని ఆడించే రిస్క్ తీసుకోకూడదని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. 'రెండు విదేశీ పర్యటనల్లోనూ అశ్విన్ గాయాల బారిన పడటం నిజంగా దురదృష్టకరం. అతను జట్టుకు చాలా అవసరమని చెప్పడంలో ఎటువంటి సందేహమూ లేదు. ముఖ్యంగా టెస్టు క్రికెట్‌లో అతని పాత్ర చాలా కీలకమైంది. అశ్విన్ 100 శాతం ఫిట్‌నెస్ సాధించి టెస్టు ఫార్మాట్‌లో మాకు అందుబాటులో ఉండాలని కోరుకుంటున్నాను. సరైన సమయానికి అశ్విన్ కోలుకోకపోవడం తీవ్ర నిరుత్సాహానికి గురిచేసింది' అని కోహ్లీ వివరించాడు. ఇలా కోహ్లీ నాలుగో టెస్టు మ్యాచ్ మీడియా సమావేశంలో మాట్లాడుతుండగానే మ్యాచ్‌కు ఎంపిక చేసిన 13 మంది సభ్యుల జాబితాలో అశ్విన్ పేరు ఉండటం అందరినీ ఆశ్చర్యపరిచింది. అయితే అశ్విన్ ఫిట్‌నెస్‌పై, అతను మ్యాచ్‌లో ఆడేదీ లేనిదీ టాస్ సమయంలో తుది నిర్ణయం తీసుకుంటారు. ఒకవేళ కెప్టెన్ ఇద్దరు స్పిన్నర్లతో బరిలోకి దిగాలని ఆలోచిస్తామోనని ముందుగానే ఎడమ చేతి మణికట్టు స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను జట్టులో చేర్చారు. ఈ జట్టులో ఇషాంత్ శర్మకు బదులుగా ఉమేష్ యాదవ్‌ను ఎంపిక చేయడం మరింత ఆశ్చర్యపరిచింది. మహ్మద్ షమీ, జస్‌ప్రీత్ బుమ్రా కూడా ఉన్నారు. అయితే ఇషాంత్‌ను ఎందుకు ఎంపిక చేయలేదో టీమ్ మేనేజ్‌మెంట్ వివరణ ఇవ్వలేదు. ఇదిలావుంటే రోహిత్ శర్మ లేని కారణంగా మెల్‌బోర్న్ టెస్టుకు దూరమైన కేఎల్ రాహుల్‌కు మరో అవకాశం లభించింది. హనుమ విహారి ఆరో నంబర్ స్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ టెస్టు సిరీస్ గెలవాలంటే సిడ్నీ మ్యాచ్‌ను టీమిండియా కనీసం డ్రా చేసుకుంటే సరిపోతుంది. ఈ మ్యాచ్ ఫలితం ఎలా ఉన్నా బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని టీమిండియా నిలబెట్టుకుంది. దీంతో ఆస్ట్రేలియాలో ఈ ఘనత సాధించిన సౌరవ్ గంగూలీతో సమానంగా కోహ్లీ నిలిచాడు. అయితే ఈ మ్యాచ్‌లో గెలిస్తే గంగూలీని కోహ్లీ వెనక్కినెట్టే అవకాశముంది. గంగూలీ కెప్టెన్సీలో 28 విదేశీ టెస్టులకు గాను 11 మ్యాచ్‌ల్లో టీమిండియా గెలిచింది. అయితే ఈ మ్యాచ్‌లో టీమిండియా గెలిస్తే ఆ రికార్డును కోహ్లీ 24 మ్యాచ్‌ల్లోనూ సాధించినట్టవుతుంది.



ఆస్ట్రేలియా విషయానికొస్తే.. మిచెల్ మార్ష్ స్థానంలో బ్యాట్స్‌మన్ పీటర్ హాండ్‌స్కాంబ్ మళ్లీ జట్టులోకి వచ్చే అవకాశముంది. మెల్‌బోర్న్ టెస్టులో పేలవమైన షాట్‌కు అవుటైన మార్ష్‌పై తీవ్ర విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. మరోవైపు ఓపెనర్ ఆరోన్ ఫించ్, లెగ్ స్పిన్ ఆల్ రౌండర్ మార్నస్ లబుస్చేంజ్ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఒకవేళ ఫించ్ గనుక జట్టుకు దూరమైతే మార్కస్ హారిస్‌తో కలిసి ఉస్మాన్ ఖవాజ ఇన్నింగ్స్‌ను ప్రారంభించే అవకాశముంది. లబుస్చేంజ్ మిడిలార్డర్‌లో ఆడతాడు. ఈ మార్పు ఆస్ట్రేలియా బ్యాటింగ్ సమస్యలు తీరుస్తుందేమో చూడాలి. ఎందుకంటే ఈ సిరీస్‌లో ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్ ఒక్కరు కూడా సెంచరీ చేయలేదు.



నాలుగో టెస్టుకు జట్లు

ఇండియా: విరాట్ కోహ్లీ (కెప్టెన్), మయాంక్ అగర్వాల్, హనుమ విహారి, కేఎల్ రాహుల్, చటేశ్వర్ పుజారా, అజింక్య రహానే, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ షమీ, ఉమేష్ యాదవ్, కుల్‌దీప్ యాదవ్, ఆర్. అశ్విన్.

ఆస్ట్రేలియా: టిమ్ పెయిన్ (కెప్టెన్/వికెట్ కీపర్), మార్కస్ హారిస్, ఆరోన్ ఫించ్, ఉస్మాన్ ఖవాజ, ట్రావిస్ హెడ్, షాన్ మార్ష్, మిచెల్ మార్ష్, నాథన్ లియాన్, మిచెల్ స్టార్క్, పాట్ కమ్మిన్స్, జోష్ హాజిల్‌వుడ్, మార్నస్ లబుస్చేంజ్, పీటర్ హాండ్‌స్కంబ్, పీటర్ సిడ్డిల్.



సచిన్ కోచ్ అచ్రేకర్ కన్నుమూత

న్యూఢిల్లీ: దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ కోచ్ రమాకాంత్ అచ్రేకర్ (87) బుధవారం కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం ముంబైలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. సచిన్‌కు ఆయన క్రికెట్‌లో నేర్పిన ఓనమాలే టెండూల్కర్‌ను మాస్టర్ బ్లాస్టర్‌గా నిలబెట్టాయి. ముంబైలోని శివాజీ పార్కులో సచిన్, కాంబ్లీలాంటి ఎందరో ఆటగాళ్లకు అచ్రేకర్ తనదైన శైలిలో శిక్షణనిచ్చారు. అచ్రేకర్ క్రికెట్‌కు అందించిన సేవలకుగాను కేంద్ర ప్రభుత్వం 1990లో ద్రోణాచార్య అవార్డును, 2010లో పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. అంతేకాకుండా 2010లో అచ్రేకర్ జీవిత సాఫల్య పురస్కార్ అవార్డు కూడా అందుకున్నారు.



సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ గురించి

చరిత్ర: గతంలో ఈ మైదానంలో ఇండియా, ఆస్ట్రేలియా జట్టు 11 మ్యాచ్‌లు ఆడాయి. అందులో ఆస్ట్రేలియా ఐదింటిలో గెలవాగా.. ఇండియా 1 మ్యాచ్‌లో విజయం సాధించింది.

ఏ సంవత్సరంలో ఎంత తేడాతో గెలిచాయి

1947 మ్యాచ్ డ్రా
1968 ఆస్ట్రేలియా 144 పరుగులతో
1978 ఇండియా ఇన్నింగ్స్, 2 పరుగులతో
1981 ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ 4 పరుగులతో
1986 మ్యాచ్ డ్రా
1992 మ్యాచ్ డ్రా
2000 ఆస్ట్రేలియా ఇన్నింగ్స్, 141 పరుగులతో
2004 మ్యాచ్ డ్రా
2008 ఆస్ట్రేలియా 122 పరుగులతో
2012 ఆస్ట్రేలియా ఇన్నింగ్స్, 68 పరుగులతో
2015 మ్యాచ్ డ్రా

ఈ సిరీస్‌లో

తొలి టెస్టు (అడిలైడ్) ఇండియా 31 పరుగులతో
రెండో టెస్టు (పెర్త్) ఆస్ట్రేలియా 146 పరుగులతో
మూడో టెస్టు (మెల్‌బోర్న్) ఇండియా 137 పరుగులతో



ఆంధ్రతో హైదరాబాద్ డ్రా

- రంజీ ట్రోఫీ మ్యాచ్

విజయనగరం: రంజీ ట్రోఫీలో భాగంగా గ్రూప్-బిలో జరిగిన హైదరాబాద్, ఆంధ్ర జట్ల మధ్య మ్యాచ్ డ్రాగా ముగిసింది. గత బుధవారం ప్రారంభమైన మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న హైదరాబాద్ జట్టు ఆంధ్ర బౌలర్ల ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో 271 పరుగులకే ఆలౌటవ్వగా... ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో రికీ భుయీ (129), భరత్ (178 నాటౌట్) శతకాలతో ఏకంగా 502/7 పరుగుల వద్ద డిక్లేర్డ్ ప్రకటించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన హైదరాబాద్ చివరి రోజు ఆట ముగిసే సమయానికి 5 వికెట్ల నష్టానికి 251 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో అజేయ శతకంతో రాణించిన భరత్ (178 నాటౌట్)కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఈ మ్యాచ్ డ్రాతో హైదరాబాద్ జట్టు గ్రూప్-బి పాయింట్ల పట్టికలో 17 పాయింట్లతో ఆరో స్థానంలో కొనసాగుతుండగా... ఆంధ్ర జట్టు 11 పాయింట్లతో చివరి స్థానంలో నిలిచింది.



వెన్నునొప్పిని కోహ్లీ ఎలా అధిగమిస్తున్నాడంటే..

సిడ్నీ: టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ తన వెన్నునొప్పి గురించి వివరించాడు. 2011 నుంచి తానీ సమస్యతో బాధపడుతున్నట్టు చెప్పాడు. మెల్‌బోర్న్ టెస్టులో కోహ్లీ తీవ్ర నొప్పికి గురయ్యాడు. వీపుపైన తనకు తాను గుద్దుకుంటూ కనిపించాడు. ఇప్పుడు ఆ నొప్పిని ఎలా అధిగమించాలో తెలుసుకున్నాడు. గత 8,9 సంవత్సరాలుగు బాధిస్తున్న వెన్ను నొప్పిని ఎలా అధిగమిస్తున్నది కోహ్లీ వివరించాడు. 'గాయాన్ని శారీరకంగానే ఎదుర్కొంటున్నాను. గత కొద్ది కాలంగా ఇలా చేస్తున్నాను. ఈ నొప్పిని అధిగమించేందుకు మరిన్ని దారులు కనుగొని పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తానన్న నమ్మకముంది. నిగ్గిల్స్ లేకుండా జీవించడం సాధ్యం కాదు. అక్కడక్కడ నాకు నిగ్గిల్స్ ఉండటం సంతోషకరం. అయితే దాన్ని సరిగ్గా మేనేజ్ చేయగలగాలి' అని కోహ్లీ చెప్పాడు. అయితే 2011 నుంచి తనకు వెన్నెముక సమస్య ఉన్నట్టు కోహ్లీ తెలిపాడు. 'నా వ్యక్తిగత ఫిట్‌నెస్ విషయానికొస్తే.. 2011 నుంచి నాకు వెన్నె ముక సమస్య ఉంది. ఇది కొత్తదేమీ కాదు. కానీ దాన్ని మేనేజ్ చేస్తూ వస్తున్నాను. ఎందుకంటే గత కొన్నేళ్లుగా శారీరక శ్రమతో ఎదుర్కొంటున్నాను. ఎవరికైనా వెన్నెముక సమస్య ఉంటే దాన్ని అలాగే ఎదుర్కోవాలి. దానిగురించి నాకు బాధ లేదు. పని ఒత్తిడి పెరిగినప్పుడు ఆకస్మిక పరిణామం జరుగుతుంది. అది అంత తీవ్రమైందేమీ కాదు. రెండు, మూడ్రోజుల్లో సర్దుకుంటుంది. దాన్ని నయం చేయడం కూడా చాలా సులువు. దాని గురించి నేను అస్సలు పట్టించుకోవడం లేదు' అని కోహ్లీ వివరించాడు. నిరంతరం పూర్తి ఫిట్‌నెస్‌తో ఉండటం వల్లే వెన్నెముక సమస్యను ఎదుర్కోగలుగుతున్నానని కోహ్లీ చెప్పాడు.



స్మిత్, వార్నర్‌లకు ప్రజలు మరో ఛాన్స్ ఇవ్వాలి

- ఆస్ట్రేలియా కెప్టెన్ టిమ్ పెయిన్

సిడ్నీ: బాల్ టాంపరింగ్ కారణంగా ఏడాది పాటు క్రికెట్‌కు దూరమైన ఆసీస్ ఆటగాళ్లు స్మిత్, వార్నర్‌లకు ఆస్ట్రేలియా ప్రజలు మరోసారి అవకాశమివ్వాలని ఆ దేశ టెస్టు కెప్టెన్ టిమ్ పెయిన్ కోరాడు. అంతేకాకుండా వారిని జాతీయ జట్టులోకి ఆహ్వానించాలని అభిప్రాయపడ్డాడు. స్మిత్, వార్నర్ బాల్ టాంపరింగ్ కారణంగా ఏడాదిపాటు క్రికెట్‌కు దూరమైన విషయం తెలిసిందే. గతేడాది మార్చిలో సౌతాఫ్రికాతో టెస్టు మ్యాచ్‌లో జరిగిన ఈ టాంపరింగ్ తమ దేశ ప్రతిష్టను దెబ్బతీసిందని ఆస్ట్రేలియా ప్రజలు వీరిపై విమర్శలు కురిపించారు. ఈ టాంపరింగ్ కారణంగా ఆసీస్ కోచ్ డారెన్ లెహమన్ ఆ పదవి నుంచి తప్పుకున్నాడు. వార్నర్, స్మిత్‌లపై పెయిన్ మాట్లాడుతూ... 'వారు త్వరలోనే జట్టులోకి వస్తారని ఆశిస్తున్నా. ఆస్ట్రేలియా ప్రజలపై నాకు పూర్తి నమ్మకముంది. వారిద్దరికి మరో అవకాశం ఇస్తారు' అని టిమ్ తెలిపాడు. 9 నెలల నిషేధం తర్వాత ఇటీవల తిరిగి మైదానంలోకి అడుగుపెట్టిన బాన్‌క్రాఫ్ట్ బిగ్‌బాష్ లీగ్‌లో పెర్త్ స్కోచర్స్ తరుపున ఆడుతున్న సంగతి తెలిసిందే. మార్చిలో దుబాయ్ వేదికగా పాకిస్తాన్‌తో జరగబోయే వన్డే సిరీస్‌లో వీరిద్దరూ ఆడే అవకాశం ఉంది అని పెయిన్ తెలిపాడు.

అలరిస్తున్న సానియా ఫ్యామిలీ ఫొటో

- ఈ ఏడాది మళ్లీ టెన్నిస్ ఆడనున్న హైదరాబాద్ స్టార్



హైదరాబాద్: గతేడాది అక్టోబర్ 30వ తేదీన ఇజహాన్ పుట్టడంతో హైదరాబాద్ టెన్నిస్ స్టార్ సానియా మీర్జా, ఆమె భర్త, పాకిస్తాన్ క్రికెటర్ షోయబ్ మాలిక్ ప్రౌడ్ పేరెంట్స్‌గా నిలిచారు. ఈ ఏడాది మళ్లీ టెన్నిస్ కోర్టులోకి దిగాలని సానియా ప్లాన్ చేస్తోంది. అయితే అంతకంటే ముందు ఆమె పెట్టిన క్యూట్ ఫ్యామిలీ ఫొటో అందరినీ అలరిస్తోంది. ఈ ఫొటోలో మూడేళ్ల చిన్నారిని తల్లి సానియా ఆడిస్తుంటే.. ఆమె భర్త షోయబ్ మాలిక్ మాత్రం గాఢ నిద్రపోతున్నాడు. 'ఇజహాన్‌ను నాకు ఇచ్చిన గత సంవత్సరానికి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ కొత్త సంవత్సరంలో నేను మాత్రం చిన్న పిల్లలా, షోయబ్ మాలిక్ మాదిరిగా నిద్రపోను' అని ట్విట్టర్‌లో ఈ ఫొటోకు సానియా ట్యాగ్ పెట్టింది.

నీ స్లెడ్జింగ్ సరైందే

- పంత్‌తో ఆసీస్ ప్రధాని మోరిసన్



సిడ్నీ: కీలకమైన నాలుగో టెస్టు మ్యాచ్‌ను పురస్కరించుకుని ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్ మోరిసన్ ఇక్కడి అధికారిక కిర్రిబిల్లి హౌస్‌కు ఆతిథ్య, పర్యాటక టీమిండియాను విందుకు ఆహ్వానించారు. మోరిసన్ భారత క్రికెటర్లను సాదరంగా పలకరించారు. అయితే ఆయనకు, భారత జట్టు వికెట్ కీపర్ రిషబ్ పంత్‌కు మధ్య జరిగిన సంభాషణ ఆసక్తికరంగా నిలిచింది. టీమిండియా మేనేజర్ సునీల్ సుబ్రమణ్యం ఆసీస్ పీఎంకు పంత్‌ను పరిచయం చేశారు. దీంతో 'ఆహ్.. యస్! నీ స్లెడ్జింగ్ సరైందే. మీకందరికీ స్వాగతం. మాకు పోటీతత్వ గేమ్‌లంటే చాలా ఇష్టం' అని మోరిసన్ అన్నారు. దీంతో ఏం చెప్పాలో తెలియని పంత్ చిరునవ్వుతో కరచాలనం చేశాడు. మెల్‌బోర్న్ టెస్టులో తొలుత ఆసీస్ కెప్టెన్ టిమ్ పెయిన్.. పంత్‌ను రెచ్చగొట్టే విధంగా మాట్లాడం.. తర్వాత భారత వికెట్ కీపర్ తగిన విధంగా సమాధానం చెప్పడం అందరి దృష్టిని ఆకర్శించింది.

ముంబై మారథాన్ అంబాసిడర్‌గా మేరీ కోమ్

ముంబై: ఆరుసార్లు వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన భారత బాక్సర్ మేరీకోమ్ ముంబైలో ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా జరిగే టాటా ముంబై మారథాన్‌కు అంబాసిడర్‌గా వ్యవహరించనుంది. ఈ మారథాన్ ఈ నెల 20న జరగనుంది. 'భారతదేశంలో రన్నింగ్‌లో విప్లవత్మకమైన మార్పు తెచ్చేందుకు టాటా ముంబై మారథాన్ ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది' అని మేరీ కోమ్ తెలిపింది. ఈ మేరకు బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో బాక్సర్ మేరీకోమ్ పాల్గొంది. 'వరల్డ్ బాక్సింగ్‌లో దిగ్గజ క్రీడాకారిణి మేరీకోమ్ ఈ కార్యక్రమంలో భాగమైనందుకు చాలా సంతోషంగా ఉంది' అని ప్రో కామ్ అధికారి వివేక్ సింగ్ తెలిపారు. 35 ఏళ్ల మేరీకోమ్ ఇప్పటివరకు ఆరుసార్లు వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన సంగతి తెలిసిందే.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at M/s JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press D.no.5-625, Atamkur village, Mangalagiri Mandal, Guntur District, Andhra Pradesh, And Published at H.No. 23-3-46, 1st Floor, Katamaraju vari veedhi, Amaravathi road, Naidu pet, Guntur (District)ANDHRAPRADESH - 522002. Editor : VUPPARI RAMESH KUMAR, RNI Reg No. APTEL/2016/73939, Phone No. 040-46519999, e-mail id: editor@manamnews.com, Web Edition www.manamnews.com